తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | గురువారం - 19- మార్చి 2026 | సంపుటి : 3 | సంచిక : 290 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


# బీఆర్ఎస్‌కు సీఎం రేవంత్ వార్నింగ్

## 2034 వరకు మా ప్రభుత్వమే

- బీఆర్ఎస్ నేతలకు సీఎం ఘాటు హెచ్చరికలు
- 2034 వరకు మా ప్రభుత్వమే ఉంటుందన్న వ్యాఖ్యలు
- తెలంగాణను ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యం
- గత ప్రభుత్వ అప్పులపై తీవ్ర విమర్శలు
- కేసీఆర్ సభకు రాకపోవడంపై ఆగ్రహం
- అవినీతి ఆరోపణలపై విచారణకు సిద్ధమన్న ప్రభుత్వం
- ఏఐ భవిష్యత్‌పై హెచ్చరికలు, 2047 విజన్‌పై స్పష్టత



హైదరాబాద్ (తెలంగాణ ముచ్చట్లు)

2029 అసెంబ్లీ ఎన్నికల్లోనూ మిమ్మల్ని మళ్లీ తొక్కుకుంటూ అధికారంలోకి వస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ నేతలకు సవాల్ విసిరారు. '2023 ఎన్నికల్లో బరాబర్ మీ నెత్తిపై కాళ్లు పెట్టి తొక్కుకుంటూ ఇక్కడకు వచ్చాను. 2029లో మళ్లీ చూసుకుందాం. మళ్లీ తొక్కకపోతే చూడండి. మీరు ఎట్లా గెలుస్తారో చూస్తాను'అని ఆవేశంగా ప్రకటించారు. బుధవా రం శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానానికి సమాధానమిస్తూ రెండున్నర గంటలకుపైగా సుదీర్ఘంగా సీఎం ప్రసంగించారు. 'ఇప్పటికైనా మీరు మర్యాదగా ఉండడం నేర్చుకుంటే మంచిది. కనీస మర్యాద దక్కుతుంది'అని హెచ్చరించారు. 2029 ఎన్నికలు కూడా కేవలం పాసింగ్ క్లౌడ్ మాత్రమే.

2034 వరకు ఈ ప్రభుత్వమే ఉంటుంది. అప్పటికే తెలంగాణ ఒక ట్రిలియన్ ఎకానమీగా ఎదుగుతుందని ప్రజలు విశ్వసిస్తున్నారు'అని చెప్పారు. ప్రతిపక్ష సభ్యులు ఆరోపిస్తున్న హిల్ట్-పి, టీడీఆర్‌లకు సంబంధించి వారు లేఖ రాస్తే ఏ విచారణ కోరినా చేయడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. 'కొందరు తమను తాము రాజులుగా భావిస్తున్నారు. రాచరిక పోకడలతో ప్రజాతీర్పును అవమానిస్తున్నారు. వారసత్వ రాజకీయాలను నమ్ముకుని అధికారం దక్కలేదనే దుఃఖంతో ఆరోపణలు, దుర్భ్రచారంతో సభను తప్పుదోవ పట్టించారు. రాజులు పోయినా రాజ్యాలు పోయినా వారి పోకడలు మారలేదు. ప్రజాస్వామ్యంలో ప్రజలే రాజులుగా మారి తమ సేవకులను నియమించుకుంటారన్న విషయాన్ని ఇప్పటికైనా గ్రహిస్తే మంచిది'అని బీఆర్ఎస్ సభ్యులను ఉద్దేశించి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

రాష్ట్ర ఆదాయం పెంచాలి..

మిగతా 2లో



# ఉగాది సందర్భంగా నేతలకు మట్టి పాత్రల అందజేసిన ఉప ముఖ్యమంత్రి

- సంప్రదాయాలకు ప్రతీకగా ఉగాది కిట్
- మట్టి పాత్రలు వాడాలని పిలుపు
- కుల వృత్తులకు ప్రోత్సాహం అవసరం

**హైదరాబాద్, మార్చి 18 (తెలంగాణ ముచ్చట్లు):** శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా శాసనసభ ఆవరణలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కలకు ఉగాది మట్టి పాత్రలను అందజేశారు. సంప్రదాయ పద్ధతుల్లో పండుగను జరుపుకోవాలని సందేశం ఇచ్చే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. "మట్టి పాత్రలు వాడండి - ఆరోగ్యాన్ని కాపాడుకోండి, కుల వృత్తులను ప్రోత్సహించండి" అనే నినాదంతో ఈ ఉగాది కిట్‌ను అందజేశారు. ఇందులో ఉగాది పండుగకు ఉపయోగపడే మట్టి కుండ, గ్లాసులు, జగ్, బౌల్‌తో పాటు షడ్రుచులకు అవసరమైన మామిడి కాయలు, వేప పువ్వు, బెల్లం, చింతపండు, కారం వంటి పదార్థాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయకులు రాష్ట్ర ప్రజలకు శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రకృతిని కాపాడుకోవడానికి, పర్యావరణాన్ని రక్షించడానికి మట్టి పాత్రల వినియోగం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఆరోగ్య పరిరక్షణలో కూడా మట్టి పాత్రల వినియోగం మంచి ఫలితాలను ఇస్తుందని తెలిపారు. మన సంస్కృతి సంప్రదాయాల్లో మట్టి పాత్రలకు ప్రత్యేక స్థానం ఉందని నాయకులు పేర్కొన్నారు. మట్టి పాత్రల వినియోగాన్ని పెంచడం ద్వారా కుల వృత్తులను ప్రోత్సహించవచ్చని తెలిపారు. తరతరాలుగా వస్తున్న ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ ఉగాది పండుగను మట్టి పాత్రలతో జరుపుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.







# వెలుగుమట్ల భూదాన్ భూములపై హైకోర్టు స్టేటస్ కో

- యథాస్థితి కొనసాగించాలని కోర్టు ఆదేశాలు
- అసలైన లబ్ధిదారులను గుర్తించాలని సూచన
- ఇళ్లు కోల్పోయిన ప్రతి ఒక్కరికి గృహం కల్పించాలని తీర్పు

2లో



# వెంగళరావు నగరంలో రూ.600 కోట్ల ప్రభుత్వ భూమి రక్షణ



- మూడు ఎకరాల భూమికి హైడ్రా ఫెన్సింగ్
- ఆక్రమణలపై కఠిన చర్యలు
- తప్పుడు పత్రాలతో కబ్జాలకు యత్నించిన పలువురు

2లో

# మూసీ ప్రాజెక్టుపై కేటీఆర్ తీవ్ర విమర్శలు


- అధికారుల అతివ్యవహారంపై తీవ్ర విమర్శలు
- డీపీఆర్‌పై సభను తప్పుదారి పట్టిస్తున్నారన్న ఆరోపణ
- భూ సేకరణ, నిర్మాణాల గణాంకాల్లో తేడాలపై ప్రశ్నలు
- ప్రాజెక్టు పేరుతో దోపిడీ జరుగుతోందన్న విమర్శ
- బఫర్ జోన్ నోటీసులతో ప్రజల్లో ఆందోళన



హైదరాబాద్ (తెలంగాణ ముచ్చట్లు)

మూసీ ప్రాజెక్టు విషయంలో అధికారులు అతిగా ప్రవర్తిస్తున్నారని, ఆరునూరైనా పూర్తి చేస్తామంటూ తమ పరిధికి మించి వ్యాఖ్యలు చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు మండిపడ్డారు. మూసీ ప్రాజెక్టు పేరిట సీఎం చేస్తున్న దోపిడీకి సహకరిస్తున్న అధికారులు ఒళ్లు దగ్గర పెట్టుకోవాలని, తాము అధికారంలోకి వచ్చాక తోకలు కత్తిరిస్తామని హెచ్చరించారు.

మిగతా 2లో

పాఠకులు, ప్రకటన కర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు స్వస్తిశ్రీ పరాభవ నామ సంవత్సర

ఉగాది శుభాకాంక్షలు


# పెట్టుబడిదారులకు తెలంగాణలో అపార అవకాశాలు: మంత్రి శ్రీధర్‌బాబు

- స్లోవేనియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించిన ప్రభుత్వం
- ఎఫ్‌టీఏతో యూరప్ ఎగుమతులకు భారీ అవకాశాలు
- లైఫ్ సైన్సెస్, ఫార్మా రంగాల్లో రాష్ట్రం ముందంజ
- ఆటోమొబైల్, పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందిస్తామన్న మంత్రి
- ఐటీ, క్లౌడ్ కంప్యూటింగ్‌లో అపార అవకాశాలు
- విదేశీ పెట్టుబడిదారులకు మెరుగైన వాతావరణం



హైదరాబాద్ (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణ ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో పెట్టుబడులకు అత్యంత అనుకూలమైన రాష్ట్రమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. లైఫ్ సైన్సెస్, ఆటోమొబైల్, ఐటీ రంగాల్లో పెట్టుబడులకు ప్రభుత్వం మెరుగైన అవకాశాలు కల్పిస్తోందని చెప్పారు. బుధవారం శాసనసభ కమిటీ హాల్లో స్లోవేనియా ప్రతినిధి బృందంతో మంత్రి సమావేశమయ్యారు. మధ్య యూరప్‌కు చెందిన సంపన్న దేశం స్లోవేనియా నుంచి వారి భారత్ రాయబారి టోమాజ్ మెన్సిన్ ఆధ్వర్యంలో వచ్చిన వాణిజ్య, పారిశ్రామిక ప్రతినిధులకు మంత్రి సాదర స్వాగతం పలికారు. యూరోపియన్ యూనియన్‌తో

మిగతా 2లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# బీఆర్ఎస్‌కు సీఎం రేవంత్ వార్నింగ్

(మొదటి పేజీ తరువాయి)

పేదలకు పంచాలి అనే పాలసీ తీసుకొస్తే కూడా అభినందించాలనే ఆలోచన ప్రతిపక్షాలకు రాకపోతే వారిని ఏమనాలని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. 'తెలంగాణ అభివృద్ధి, ప్రజల భవిష్యత్ పట్ల సభావేదిక నుంచి వివరించాను. అధికారం పోయిందనే బాధతో ఇది కొందరికి రుచించదు. వారు కక్కిన విషాన్ని శివుడి మాదిరిగా గొంతులోనే పెట్టుకుంటాను'అని అన్నారు. తమపై గత ప్రభుత్వం పదేళ్లలో రూ.8.11 లక్షల కోట్ల అప్పు భారాన్ని, దానికి 11 శాతం అధిక వడ్డీ మోపినందుకు, దానిని భరించడం వల్లనే తమ ప్రభుత్వానికి ప్రస్తుత పరిస్థితి ఏర్పడిందన్నారు.

తెలంగాణ ప్రజల ఆలోచనలు, ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ, రాష్ట్ర అభివృద్ధి పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న సంకల్పాన్ని, గొప్ప విజన్‌ను ఆవిష్కరిస్తూ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా చేసిన ప్రసంగం చరిత్రాత్మకమని రేవంత్‌రెడ్డి చెప్పారు. 'గవర్నర్ ప్రసంగం కేవలం అక్షరాల రూపంలో ఉన్న ఆలోచనలు కాదు. తెలంగాణ అభివృద్ధికి మార్గదర్శి. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ ఎదగడానికి అవసరమైన విశిష్ట ప్రణాళిక'అని రేవంత్ పేర్కొన్నారు.

'కొత్త గవర్నర్‌కు శుభాకాంక్షలు తెలిపేందుకు విపక్ష నేత కేసీఆర్ అసెంబ్లీకి వస్తారనిప్రజలు ఆశించారు. సభాసంప్రదాయాలను గౌరవించకపోవడం తెలంగాణకు, ప్రజలకు తీరని మచ్చ'అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 'వారసత్వాలతో అధికారం రాదు.. చెట్టుపేరు చెప్పి కాయలు అమ్ముకుంటామంటే కుదరదు. సొంతంగా సత్తా ఉండాలి. ఔరంగజేబుగా మారతామంటే అది దురాశగా మారుతుంది. విపరీత పోకడలు, విధానాలకు పోవద్దు, అధికారం రాలేదని బాధ, దుఃఖం ఉండొద్దు'అని ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ నేతలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. 'కొందరు తమను తాము దైవాంశ సంభూతులమని అనుకుంటున్నారు. మీరు (బీఆర్ఎస్ నేతలు) దేవుళ్లు కాదు, దోపిడీదారులు.

నోటిఫికేషన్లు, ఆర్డర్లు ఎందుకు ఇవ్వలేకపోయారు. అసంపూర్తిగా వదిలి వేసిన అసమర్థులు మీరు. మీలాగా గాలికి వచ్చిన వాళ్లం కాదు. 'నేను కష్టజీవిని. తెలియకపోతే నేర్చుకుంటాను. ఇతరులకు నేర్పుతాను. ఇదే పంథాలో ముందుకు సాగి అనుకున్నవి కచ్చితంగా సాధిస్తాను'అని ఆయన పేర్కొన్నారు. 'పారిశ్రామిక భూముల బదలాయింపులపై 2014 జూన్ 2 నుంచి ఇప్పటి వరకు హిల్ట్ పాలసీతో సహా దేనిపై అయినా సీబీఐ, ఈడీ, సిట్, లేదా ఏ అంతర్జాతీయ సంస్థతో విచారణకైనా మేం సిద్ధం. అని బీఆర్ఎస్ నేతలకు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు.

'కేసీఆర్ అసెంబ్లీలో ఇదే స్థానం నుంచి తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీకి శాసనసభ కృతజ్ఞతలు చెబుతున్నది, ఆమె దయతోనే తెలంగాణ వచ్చిందన్నారు. ఇప్పుడు ఆయన కుమారుడు అందుకు విరుద్ధంగా మాట్లాడుతున్నారు'అని సీఎం రేవంత్ అన్నారు. తండ్రి బతికి ఉండగానే తద్దినం పెట్టడం అంటే ఏమిటో ఇప్పుడు అర్థమవుతోందని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. బావమరుదులు కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయడానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నారన్నారు. వారిద్దరు అలాగే వ్యవహరిస్తే.. పార్టీ ముక్కలు అవుతుందని, అది కాకుండా చూసుకోవాలని, అధికారంలోకి వచ్చేది కల్ల అని వ్యాఖ్యానించారు.

తమ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత చేసిన మొత్తం అప్పులు రూ. 3,47,294 కోట్లు అయితే.. తాము చెల్లించిన అసలు, వడ్డీ కలుపుకొని రూ. 3,30,570 కోట్లు అని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. తాము అధికారంలో ఉన్న ఈ రెండున్నరేళ్లలో నికరంగా చేసిన అప్పు కేవలం రూ.17 వేల కోట్లు మాత్రమేనని స్పష్టంచేశారు. 2014 జూన్ 2న అధికారం చేపట్టిన టీఆర్ఎస్ (బీఆర్ఎస్)కు అప్పటి వరకున్న అప్పులు కేవలం రూ.69 వేల కోట్లు అయితే.. వారు తమకు 2023 డిసెంబర్‌లో అధికారం అప్పగించే నాటికి అప్పులు రూ. 6,71,757 కోట్లకు తోడు చేతి బదులుగా, కాంట్రాక్టర్లకు బకాయిలు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు చెల్లించాల్సినవి కలుపుకొంటే మరో రూ. 1.40 లక్షల కోట్లు ఉన్నాయని మొత్తంగా తమకు వారు అందించిన అప్పులు రూ. 8.11 లక్షల కోట్లు అని రేవంత్ వెల్లడించారు. కమీషన్లకు కక్కుర్తిపడి వారు 11 శాతం వడ్డీకి కూడా రుణాలు తీసుకున్నారని దుయ్యబట్టారు. దాదాపు రెండు లక్షల కోట్ల రూపాయలను రీస్ట్రక్చర్ చేయడానికి ప్రయత్నిస్తున్నామని, అలా చేయడం వల్ల వడ్డీ భారం ఏటా దాదాపు రూ. 4000 కోట్లు ఆదా అవుతాయన్నారు.

**వైద్యానికి రూ. 4400 కోట్లు వ్యయం చేశాం**

పేదల వైద్యం కోసం తమ ప్రభుత్వం ఇప్పటి వరకు రూ. 4,400 కోట్లు వ్యయం చేసిందని సీఎం రేవంత్ చెప్పారు. ఆరోగ్యశ్రీ పథకం కింద రూ. 2,300 కోట్లు, సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ. 2046 కోట్లు పేదల వైద్యం కోసం ఖర్చు చేశామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలోని మంత్రుల వద్ద పనిచేసిన పీఏలు ఈ సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పేద వారిపేట తీసుకుని వాటిని స్వాహా చేశారని, అలాంటి వారు తమను ప్రశ్నిస్తారా అని దుయ్యబట్టారు. ఆరోగ్యశ్రీని బీఆర్ఎస్ పూర్తిగా నాశనం చేసిందని మండిపడ్డారు. తాము అధికారంలోకి వచ్చిన రెండురోజుల్లోనే రూ. 5 లక్షలున్న ఆరోగ్యశ్రీని రూ. 10 లక్షలకు పెంచామని స్పష్టం చేశారు.

'వార్డు మెంబర్ కూడా కాని వ్యక్తి (హరీశ్‌రావు)ని మంత్రిగా చేసింది దివంగత నేత, నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి. కనీసం కృతజ్ఞతా భావం ఉండాలి కదా? చంద్రబాబు దయాదాక్షిణ్యాలతో సిరిసిల్ల ఎమ్మెల్యేగా (కేటీఆర్) గెలిచారు. నేను స్వశక్తితో జెడ్పీటీసీ నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికై ఆ తర్వాతే రాజకీయ పార్టీలోకి వచ్చాను. నాతో నీకు పోలిక ఏమిటి? నాతో పోటీ ఏమిటి? నా కాలిగోటికి కూడా సరిపోవు' అని సీఎం రేవంత్ అన్నారు. '2009లో పొత్తుధర్మంలో భాగంగా పాలమూరు బిడ్డలం కేసీఆర్‌ను భుజాన వేసుకుని ఎంపీగా గెలిపించాం. అన్నం పెట్టిన మాకు సున్నం పెట్టారు. కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు ఏదైనా పూర్తిచేశారా?' అని రేవంత్ వ్యాఖ్యానించారు.

2023 డిసెంబర్ 1 నుంచి ఇప్పటివరకు ప్రధాన ప్రతిపక్ష నేత రూ.1,06,56,674 జీతభత్యాలు పొందారు. విధులకు హాజరుకాకుండా జీతభత్యాలు తీసుకోవడంపై ఒక నిర్ణయం తీసుకోవాలి. అది ఉద్యోగులైనా రాజకీయ నేతలైనా కూడా చర్యలు తీసుకోవాలి' అని రేవంత్‌రెడ్డి చెప్పారు. 'ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్‌కు విజ్ఞప్తి... సభకు రండి, చర్చలో పాల్గొనండి.. మాజీ సీఎంకు ఆహ్వానం పలుకుతున్నాం. గవర్నర్ ప్రసంగంపై ప్రభుత్వానికి సూచనలు, సలహాలు వస్తా యని ఆశించాను. ఆశించిన మేర ప్రధాన ప్రతిపక్షం వ్యవహారశైలి లేదు' అని అన్నారు. ఇప్పటికైనా కేసీఆర్ సభకు రావాలని, వస్తారని ఆశిస్తున్నామన్నారు.



భవిష్యత్‌లో ఏఐ సునామీ రాబోతుందని రేవంత్‌రెడ్డి చెప్పారు. 'దీనిని ఎదుర్కొనేందుకు ప్రణాళికలు రూపొందించిన ఒక పాలసీ డాక్యుమెంట్‌ను గవర్నర్ ప్రసంగంలో వివరించారు. రాబోయే రోజుల్లో వైట్ కాలర్ జాబ్‌లు పోయి బ్లూకాలర్ జాబ్‌లు రానున్నాయి. ప్రతిపక్ష నాయకులు తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్‌ను కనీసం చూశారా? గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని మనం భవిష్యత్ ప్రణాళికలు రూపొందించకపోతే తరువాతి తరాలు మనల్ని క్షమించవు. అన్ని రంగాల మేధావులతో సమన్వయం చేసుకుని 2047 విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించుకున్నాం. తెలంగాణను క్యూర్, ప్యూర్, రేర్‌గా విభజించుకున్నాం' అని సీఎం వివరించారు.



# పెట్టుబడిదారులకు తెలంగాణలో అపార అవకాశాలు: మంత్రి శ్రీధర్‌బాబు

(మొదటి పేజీ తరువాయి)

కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) కారణంగా తెలంగాణ నుంచి యూరప్‌కు ఎగుమతి చేసే 99.95% ఉత్పత్తులపై సుంకాలు ఉండవని తెలిపారు. ఎఫ్‌టీఏతో విదేశీ పెట్టుబడిదారులకు రాష్ట్రంలో మరింత అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయని చెప్పారు.

తెలంగాణలో ఫార్మా, జీవ విజ్ఞాన రంగాలు, వాహనాల విడిభాగాల ఉత్పత్తి పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ప్రభుత్వ పరంగా అన్నిరకాల ప్రోత్సాహకాలు అందిస్తామని మంత్రి చెప్పారు. ఔషధ, బయో టెక్నాలజీ రంగాల్లో కూడా రాష్ట్రం గణనీయమైన ప్రగతి సాధించిందని, ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాల్లో దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నందున ఇక్కడి మౌలిక సదుపాయాలు, పరిశ్రమలతో భాగస్వామ్యం పెట్టుబడిదారులకు లాభదాయకమవుతుందని వివరించారు.

ఐటీ అభివృద్ధి, క్లౌడ్ కంప్యూటింగ్‌లో కూడా ఇక్కడ అపారమైన అవకాశాలున్నాయని మంత్రి చెప్పారు. ఈ సమావేశంలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిత్తల్, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి, స్లోవేనియా ప్రతినిధులు ఆసిఫ్ ఇక్బాల్, సుజిత్ నాయర్, కీర్తి చిలుకూరి తదితరులు పాల్గొన్నారు.

# మూసీ ప్రాజెక్టుపై కేటీఆర్ తీవ్ర విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)

శాసనసభ లాబీలోని బీఆర్ఎస్ శాసనసభాపక్షం చాంబర్‌లో కేటీఆర్ బుధవారం మీడియాతో ఇష్టాగోష్ఠి నిర్వహించారు.

మూసీ సుందరీకరణకు సంబంధించి అందరి అభిప్రాయంతో సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను తయారు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఒంటెద్దు పోకడతో వ్యవహరిస్తోందన్నారు. మూసీ ప్రాజెక్టుకు ఆసియా అభివృద్ధి బ్యాంకు రుణం వచ్చిందని, డీపీఆర్ పూర్తయిందని సీఎం, మంత్రులు సభను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు.

డీపీఆర్ పూర్తయినట్లు సభలో ఆధారాలు చూపకపోతే అసెంబ్లీని తప్పుదోవ పట్టించినందుకు మంత్రిపై సభా హక్కుల ఉల్లంఘన తీర్మానం ప్రవేశపెడతామని కేటీఆర్ చెప్పారు. 3,297 ఎకరాల భూ సేకరణ, 10 వేల నిర్మాణాలపై ప్రభావం చూపుతుందని నోటిఫికేషన్ ఇచ్చిన ప్రభుత్వం.. అసెంబ్లీలో మాత్రం 1,400 నిర్మాణాలు ఉన్నాయని మాత్రమే చెప్తోందన్నారు.



'మూసీ పరిసరాలను సుందరీకరణ చేయడం మినహా ప్రభుత్వం చేసేదేమీ ఉండదు. మధురిడ్జ్ పార్కువాసులపై వల్లమాలిన ప్రేమ ఉన్నట్లు నటిస్తున్న సీఎం ఇతర నిర్వాసితులనూ అదే రీతిలో ఎందుకు చూడటం లేదు. మూసీ ప్రాజెక్టు అప్పగించిన మెయిన్‌హార్ట్ కాంట్రాక్టు సంస్థను సింగపూర్, పాకిస్తాన్‌తోపాటు ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా కూడా బ్లాక్ లిస్టులో పెట్టింది. బఫర్‌జోన్‌లో 50 మీటర్లు దాటి ఎక్కడో 5 కి.మీ. దూరంలో ఉన్న హనుమాన్‌నగర్ వాసులకూ నోటీసులు ఇస్తున్నారు.

పలువురు మంత్రులు, సీఎం సోదరుడు, పలువురు నేతల ఇళ్లు బఫర్ జోన్‌లో ఉన్నాయి. నార్సింగి, మంచిరేవుల వరకు మూసీ బఫర్‌లో అనేక నిర్మాణాలు ఉన్నాయి. ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) అంటే సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి అనే విమర్శ ఉంది. హైదరాబాద్‌లో ఏవీ రెడ్డి, కొండల్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి తదితరులు ముఠాగా ఏర్పడి రిటైర్డ్ అధికారుల అండతో భూ దందా సాగిస్తున్నారు'అని కేటీఆర్ పేర్కొన్నారు.

'సీఎంకు, మంత్రులకు పాలనపై పట్టులేదు. మొక్కుబడిగా అసెంబ్లీ సమావేశాలు సాగుతున్నాయి. మంత్రులకు అధికారులు బిజినెస్ రూల్స్ చెప్పాలి. ఐటీ రంగం కుప్పకూలితే హైదరాబాద్‌లో ఆతిథ్య, రియల్ ఎస్టేట్ రంగాలు దెబ్బతింటాయి. ఫ్యూచర్ సిటీ పేరిట ఫార్మాసిటీ కోసం బీఆర్ఎస్ హయాంలో సేకరించిన 14 వేల ఎకరాలతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలనుకుంటున్నారు. ఫార్మా భూముల్లో ఎమ్మెల్యేలు, జర్నలిస్టులు, జడ్జీలు, జూ పార్కులకు భూములు కేటాయిస్తామని ప్రభుత్వం చెప్తోంది'అని కేటీఆర్ చెప్పారు.



# వెలుగుమట్ల భూదాన్ భూములపై హైకోర్టు స్టేటస్ కో

**ఖమ్మం, మార్చి 18 (తెలంగాణ ముచ్చట్లు):** ఖమ్మం జిల్లా వెలుగుమట్ల ప్రాంతంలోని భూదాన్ భూముల వ్యవహారంపై హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. భూదాన్ భూములపై ప్రస్తుతం ఉన్న పరిస్థితిని అలాగే కొనసాగించాలని కోర్టు స్టేటస్ కో విధించింది. భూదాన్ భూముల విషయంలో అసలైన లబ్ధిదారులను గుర్తించాలని బాధితులు హైకోర్టును ఆశ్రయించారు. నష్టపోయిన బాధితులందరికీ భూదాన్ భూముల్లో ఇళ్ల స్థలం మరియు గృహం మంజూరు చేయాలని వారు కోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఈ కేసును పరిశీలించిన హైకోర్టు 311 మంది మాత్రమే కాకుండా, అక్కడ ఇళ్లు కోల్పోయిన ప్రతి ఒక్కరికి ఇళ్లను మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. బాధితులకు న్యాయం జరిగేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని తెలిపింది. అలాగే భూదాన్ భూములపై స్టేటస్ కో కొనసాగించాలని ఖమ్మం జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తాహసీల్దార్లకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ వరకు యథాస్థితి కొనసాగించాలని స్పష్టం చేసింది.

# వెంగళరావు నగరంలో రూ.600 కోట్ల ప్రభుత్వ భూమి రక్షణ

**హైదరాబాద్, మార్చి 18 (తెలంగాణ ముచ్చట్లు):** నగరం నడిబొడ్డున ఖైరతాబాద్ మండలంలోని వెంగళరావు నగరంలో మూడు ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని హైడ్రా అధికారులు కాపాడారు. మార్కెట్ విలువ సుమారు రూ.600 కోట్ల వరకు ఉండే ఈ భూమిపై కొనసాగుతున్న ఆక్రమణలను గుర్తించిన అధికారులు బుధవారం ప్రత్యేక చర్యలు చేపట్టి భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూమి అని సూచిస్తూ బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. 1975 కంటే ముందే సంబంధిత వ్యక్తులకు పరిహారం చెల్లించి సుమారు 45 ఎకరాల భూమిని హౌసింగ్ బోర్డు సేకరించింది. ఆ భూమిపై 660 ప్లాట్లతో లేఔట్ ఏర్పాటు చేయడంతో పాటు పార్కులు, ప్రజావసరాల కోసం కొన్ని స్థలాలను కేటాయించింది. వెంగళరావు నగర్ ప్రధాన రహదారికి



ఆనుకుని ఐదు ఎకరాల భూమిని ప్రజా అవసరాల కోసం ఖాళీగా ఉంచారు. అయితే ఇందులో ఇప్పటికే రెండు ఎకరాల వరకు ఆక్రమణలు జరిగి శాశ్వత నిర్మాణాలు ఏర్పడ్డాయి. మిగిలిన మూడు ఎకరాల ప్రభుత్వ భూమిపై తాజాగా ఆక్రమణలు పెరగడంతో హైడ్రా రంగంలోకి దిగింది. హౌసింగ్ బోర్డు నుంచి గతంలో పరిహారం తీసుకున్న కొంతమంది వ్యక్తులతో పాటు మరో మూడు గ్రూపులు ఈ భూమి తమదేనని చెబుతూ ఆక్రమణలకు ప్రయత్నించినట్లు అధికారులు గుర్తించారు. ఈ భూమిపై హక్కు ఉందని చెబుతున్న వారందరితో హైడ్రా సమావేశం ఏర్పాటు చేసి వారి పత్రాలను పరిశీలించింది. అయితే ఎవరి వద్దా సరైన ఆధారాలు లేవని అధికారులు నిర్ధారించారు. ఇదే సమయంలో ఈ భూమి తమదేనని చెబుతున్న కొందరు హైకోర్టును కూడా ఆశ్రయించారు. హైకోర్టు స్టే కొనసాగుతున్నప్పటికీ అక్కడ కొత్తగా గుడిసెలు వేయడం, షెడ్డులు నిర్మించడం, వివిధ వ్యాపారాలు నిర్వహించడం వంటి చర్యలు కొనసాగుతున్నట్లు స్థానికులు ఫిర్యాదులు చేశారు. మీడియాలో కూడా ప్రభుత్వ భూమి ఆక్రమణలపై కథనాలు రావడంతో హైడ్రా అధికారులు బుధవారం ఆక్రమణలను తొలగించి మూడు ఎకరాల భూమిని రక్షించారు. భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ప్రభుత్వ భూమిగా స్పష్టంగా గుర్తింపులు ఏర్పాటు చేశారు.

# రైల్వే టికెట్లు సెకన్లలో బుక్: హైస్పీడ్ రిజర్వేషన్ సిస్టమ్ త్వరలో ప్రారంభం

ఇలాంటి సమస్యలకు చెక్ పెట్టే కొత్త రైల్వే రిజర్వేషన్ సిస్టమ్ త్వరలోనే అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం 1985 నుండి ఉపయోగంలో ఉన్న ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్ ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన టికెటింగ్ వ్యవస్థలలో ఒకటిగా నిలిచింది. నాలుగు దశాబ్దాలుగా ఈ సిస్టమ్ కొనసాగుతూ, కొన్ని సవరించింపులు పొందినప్పటికీ, సర్వర్ నెమ్మదిగా పనిచేయడం, టికెట్లు సులభంగా బుక్ కాకపోవడం వంటి సమస్యలు ఉన్నాయి.

ఐఆర్‌సీటీసీ కొత్త హైస్పీడ్ రిజర్వేషన్ ఫ్లాట్‌ఫామ్‌ను అభివృద్ధి చేయడంలో రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేయనుంది. ఈ కొత్త సిస్టమ్ ద్వారా నిమిషానికి 1.25 లక్షల టికెట్లు బుక్ చేయవచ్చు. నెక్స్ట్ జనరేషన్ సిస్టమ్ వెబ్ సైట్ స్లో అవ్వడాన్ని తగ్గిస్తుంది, పీక్ బుకింగ్ సమయంలో సర్వర్ ఇష్యూస్ రాకుండా చూసుకుంటుంది. ఆటోమేటెడ్ బాట్స్ వల్ల టికెట్ల రిజర్వేషన్ కోల్పోకుండా సమర్థవంతంగా టికెట్లు బుక్ చేయవచ్చు. నూతన వ్యవస్థ స్థిరత్వం, వేగం, సౌకర్యాన్ని పెంచడమే లక్ష్యం. సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఈ ప్రాజెక్టును చేపడుతోంది. కొత్త సిస్టమ్ అందుబాటులోకి రాగానే ప్రయాణికులు సులభంగా, వేగంగా, సమస్యలేమీ లేకుండా రైల్వే టికెట్లు బుక్ చేసుకోవచ్చు.




# దొంగతనం కేసులో నిందితుడు అరెస్ట్

- రిమాండ్‌కు తరలింపు

**స్టేషన్ ఘనపూర్, మార్చి 18 (తెలంగాణ ముచ్చట్లు):** జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ మండల కేంద్రంలోని శివునిపల్లిలో జరిగిన దొంగతనం కేసులో ఒక నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, తూర్పు గోదావరి జిల్లా రాజావోమంగి మండలం మంచంగి గ్రామానికి చెందిన తలుపులయ్య (40), తానేదార్‌పల్లి గ్రామంలో గడం కొమురయ్యకు చెందిన కోళ్ల ఫారం వద్ద పని కుదుర్చుకున్నాడు. యజమాని ఇంట్లో ఎవరూ లేని సమయాన్ని అదునుగా చూసుకొని ఈ ఏడాది ఫిబ్రవరి 3వ తేదీన ఇంట్లోకి చొరబడి సుమారు రెండున్నర తులాల బంగారాన్ని దొంగిలించాడు.

ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, మార్చి 18న శివునిపల్లి అంబేద్కర్ సెంటర్ వద్ద నిర్వహించిన వాహన తనిఖీల సమయంలో ఐపీఎస్ అధికారి మనిషా ఆధ్వర్యంలో నిందితుడిని పట్టుకున్నారు. విచారణలో అతడు దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడి వద్ద నుంచి దొంగిలించిన బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతడిని కోర్టులో హాజరు పరచగా, న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారు. ఈ కేసులో పోలీసులు మరింత విచారణ కొనసాగిస్తున్నారు.



# అమావాస్య సందర్భంగా కాలభైరవ స్వామికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

**ఉప్పల్, మార్చి 18 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ బగాయత్‌లోని కాలభైరవ స్వామి దేవాలయంలో అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాలభైరవ స్వామి వారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అదేవిధంగా ప్రాంత ప్రజల అభ్యున్నతి



కోసం తన వంతు కృషి కొనసాగిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# అమావాస్య సందర్భంగా అన్నప్రసాద వితరణ, పేదలకు ఆర్థిక సహాయం

**కుషాయిగూడ, మార్చి 18 (తెలంగాణ ముచ్చట్లు):** వాసవి మిత్రమండలి ఆధ్వర్యంలో ఈసీఐఎల్ ఎక్స్ రోడ్ సమీపంలోని సాయిబాబా మందిరంలో ప్రతి అమావాస్య సందర్భంగా నిర్వహించే అన్నప్రసాద వితరణ కార్యక్రమం బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు.అనంతరం పేద వృద్ధ మహిళలు మాలే వరమ్మ, కొండూరి విజయ, తోడుపునూరి ఉమారాణి, పడకంటి కమలమ్మలకు ప్రతినెల అందించే పింఛన్‌లో భాగంగా ఈ నెలకు గాను ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున మొత్తం నలుగురికి ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో వాసవి మిత్రమండలి అధ్యక్షులు పెద్ది నాగరాజు గుప్త, ప్రధాన కార్యదర్శి రెబెల్లి శ్రీనివాస్ గుప్త, కోశాధికారి రాముని తిరుమలేష్ గుప్త, కార్యనిర్వాహక కార్యదర్శి గంప కృష్ణ గుప్త పాల్గొన్నారు.ఉపాధ్యక్షులు నంగునూరి




అశోక్ గుప్త, వైవీయూ నాగేశ్వర్ రావు గుప్త, తాటి శ్రీనివాస్ గుప్త, కార్యదర్శులు బాచెల్లి నవీన్ గుప్త, అమర కృష్ణ గుప్త, చందా సంతోష్ గుప్త, బల్లి శ్రీధర్ గుప్త తదితరులు హాజరయ్యారు.కార్యవర్గ సభ్యులు మిర్యాల అరుణ్ కుమార్ గుప్తతో పాటు సభ్యులు ఉప్పల శ్రీనివాసులు గుప్త, బెల్దే భగవాన్ గుప్త, చంద్రగిరి తారకేశ్వర్ గుప్త, పెద్ది నవీన్ గుప్త, నీలా శివకుమార్ గుప్త, అర్థం శ్రీనివాస్ గుప్త, బుస్సా శ్రీనివాస్ గుప్త, కూర రామ్మోహన్ గుప్త, కొండూరి లక్ష్మణ్ రావు గుప్త, రవ్వ ఈశ్వరరావు గుప్త, వీబీవీ కృష్ణ గుప్త, పెద్ది శ్రీనివాస్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

# పెద్దవాగు ప్రాజెక్టుపై నిర్లక్ష్యం: బీజేపీ తీవ్ర విమర్శలు

- రెండేళ్లైనా పునర్నిర్మాణం పూర్తి కాక రైతుల్లో ఆందోళన.

**అశ్వరావుపేట, మార్చి 18 (తెలంగాణ ముచ్చట్లు):**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట మండలంలోని పెద్దవాగు ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బీజేపీ నాయకుడు తంబళ్ల రవి తీవ్రంగా విమర్శించారు. ప్రాజెక్టు కట్ట తెగి దాదాపు రెండేళ్లు గడిచినా ఇప్పటివరకు పునర్నిర్మాణ పనులు పూర్తి చేయకపోవడం వల్ల రైతులు, మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. బీజేపీ నాయకులు ప్రాజెక్టును సందర్శించి పరిస్థితిని పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ, వరదల కారణంగా నష్టపోయిన రైతులకు ఇప్పటికీ సరైన పరిహారం అందలేదని, ప్రభుత్వ స్పందన ఆశించిన స్థాయిలో లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీటి కోసం పూర్తిగా ఈ ప్రాజెక్టుపై ఆధారపడి ఉన్న పరిసర గ్రామాల రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని తెలిపారు. ప్రాజెక్టు పునర్నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని ఆరోపిస్తూ, నిర్మించిన రింగు బండ స్థిరత్వంపై అనుమానాలు వ్యక్తం చేశారు. నాసిరకం పనుల వల్ల రాబోయే వర్షాకాలంలో మళ్లీ కట్ట దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులు ప్రమాదంలో పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇక చెరువు ఆధారంగా జీవనం సాగిస్తున్న మత్స్యకారులకు కూడా ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి భరోసా కల్పించలేదని తెలిపారు. ఉపాధి కోల్పోయిన వారికి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి, తక్షణ సహాయం అందించాలని డిమాండ్ చేశారు. వర్షాకాలం సమీపిస్తున్న దృష్ట్యా ప్రభుత్వం వెంటనే మేల్కొని, నాణ్యమైన పద్ధతుల్లో కట్టను బలోపేతం చేసి, ప్రాజెక్టును పూర్తిస్థాయిలో రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని తంబళ్ల రవి కోరారు. సమస్యలను నిర్లక్ష్యం చేస్తే బాధిత రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నిధులు విడుదల చేసి పనులను వేగవంతం చేయాలని, సంబంధిత అధికారులపై బాధ్యతను నిర్ధారించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలను పట్టించుకోకపోతే రానున్న రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు గూడా ముత్యాలరావు, కారం రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

# గ్రీన్ చానల్ హామీలు ఎక్కడ?

- ప్రభుత్వం మాట తప్పిందని విమర్శలు.
- బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని వినతి.

**దమ్మపేట, మార్చి 18(తెలంగాణ ముచ్చట్లు):**



గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలను పంచాయతీ నిధుల నుంచే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో కార్మికులపై అదనపు భారంగా మారిందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ విమర్శించారు. ఈ మెమోను తక్షణమే రద్దు చేసి, పెండింగ్‌లో ఉన్న బకాయి వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బుధవారం గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఎంపీడీవో రవీంద్ర రెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ, గతంలో పంచాయతీ నిధుల నుంచే వేతనాలు చెల్లించడంతో నిధుల కొరత ఏర్పడితే కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడేవారని చెప్పారు. కొన్నిసార్లు నెలల తరబడి జీతాలు అందక కుటుంబాలు ఆర్థిక సంక్షోభంలోకి వెళ్లిన సందర్భాలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం మారిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రామపంచాయతీ కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో 'గ్రీన్ చానల్' ద్వారా నేరుగా బ్యాంకు ఖాతాల్లో వేతనాలు జమ చేస్తామని, ఇందుకు ప్రత్యేక బడ్జెట్ కేటాయిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే ఆ హామీలు అమలు కాకుండా మళ్లీ పంచాయతీల ద్వారానే వేతనాలు చెల్లించాలని నిర్ణయం తీసుకోవడం ఆశ్చర్యకరమని, కార్మికుల విశ్వాసాన్ని దెబ్బతీసేదని అన్నారు. గ్రామపంచాయతీల వద్ద సరిపడా నిధులు లేకపోవడంతో కార్మికులు స్థానిక ప్రజాప్రతినిధుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల కష్టాలు పరిగణనలోకి తీసుకోకుండా నిర్ణయాలు తీసుకోవడం సమంజసం కాదన్నారు. కార్మికుల కడుపు నింపేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కార్మికులకు రోజుకు ఒక్క పూట పని కల్పించాలని, కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సంక్షేమ పథకాలను అమలు చేసి భద్రత కల్పించాలని కోరారు. ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేసి కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ మురహరి, రఘు, రామకృష్ణ, మల్లేశ్వరి, విజయలక్ష్మి, భవాని, యశోద తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా 'ది గోల్డెన్ గాలా' బ్యాంక్వెట్ హాల్ ప్రారంభం

- ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి






**ఏ ఎస్ రావు నగర్, మార్చి 18 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ పరిధిలోని జమ్మిగడ్డ జి.ఆర్. రెడ్డి నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 'ది గోల్డెన్ గాలా - బ్యాంక్వెట్స్ & కేటరర్స్' బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆధునిక సదుపాయాలతో కూడిన బ్యాంక్వెట్ హాల్ అందుబాటులోకి రావడం శుభపరిణామమన్నారు.వివాహాలు, నిశ్చితార్థాలు, పుట్టినరోజు వేడుకలు వంటి శుభకార్యాలతో పాటు సామాజిక కార్యక్రమాలకు ఈ హాల్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. నాణ్యమైన ఆహారం, మెరుగైన సేవలతో ప్రజల విశ్వాసాన్ని పొందాలని నిర్వాహకులను కోరారు. ఇలాంటి సంస్థల ఏర్పాటు ప్రాంతీయ అభివృద్ధితో పాటు ఉపాధి అవకాశాలను పెంపొందిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, పజ్జూరి పావని మణిపాల్ రెడ్డి, స్వర్ణ రాజ్ శివమణి, బొజ్జ రాఘవ రెడ్డి, కాసం మహిపాల్ రెడ్డి, పాకాల రాజన్న, నవీన్ గౌడ్, మహేష్ గౌడ్, కుమార స్వామి, మణెమ్మ, రహీం అల్లురయ్య, కిరణ్, ఆనంద్ చారి, విజేందర్, రాజేష్, ప్రకాష్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.నిర్వాహకులు డి. త్రిష్ణక, డి. సందీప్, ఎస్. సాయి కుమార్, ఎస్. సంతోష్ కుమార్, డి. శశాంక ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సత్కరించారు. వివిధ పార్టీల నాయకులు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరై నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

# జయన్న తిరుమలాపురం ప్రకృతి వ్యవసాయానికి ఆదర్శంగా నిలవాలి

-- జిల్లెల చిన్నారెడ్డి

**వనపర్తి,మార్చి18(తెలంగాణ ముచ్చట్లు):**





వనపర్తి జిల్లా గోపాల్‌పేట్ మండలం జయన్న తిరుమలాపురం గ్రామంలో నిర్వహించిన ప్రకృతి వ్యవసాయ అవగాహన సదస్సులో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత అని అన్నారు.స్వాతంత్ర్యం అనంతరం దేశంలో ఆకలి సమస్య తీవ్రంగా ఉండగా, హరిత విప్లవంతో ఆహార ఉత్పత్తి పెరిగిందని గుర్తుచేశారు.అయితే రసాయనిక ఎరువుల అధిక వినియోగం వల్ల భూముల సారం తగ్గి, ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతోందని తెలిపారు.అందుకే మళ్లీ ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని సూచించారు.రైతులు ఆదాయం పెంచుకునేందుకు కూరగాయల సాగు, పాడి పరిశ్రమ, కోళ్లు, గొర్రెల పెంపకం వంటి ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించాలని ఆయన సూచించారు.జయన్న తిరుమలాపురం గ్రామంలో ఇప్పటికే 125 మంది రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేస్తుండటం అభినందనీయమని అన్నారు.ఈ సందర్భంగా రైతులకు ప్రకృతి వ్యవసాయ కిట్లను పంపిణీ చేశారు.కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, గ్రామ పెద్దలు మరియు రైతులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే దేవేందర్ గౌడ్‌కు జన్మదిన వేడుకలు



**కుషాయిగూడ, మార్చి 18 (తెలంగాణ ముచ్చట్లు):** మాజీ హోం శాఖ మంత్రి తుల్లా దేవేందర్ గౌడ్ జన్మదినం సందర్భంగా నాయకులు, అభిమానులు ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ యువ నాయకుడు రేగళ్ల సతీష్ రెడ్డి తుక్కుగూడలోని ఆయన నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా సతీష్ రెడ్డి మాట్లాడుతూ, సమైక్య ఆంధ్రప్రదేశ్ కాలంలో మేడ్చల్ నియోజకవర్గం నుంచి వరుసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై హ్యాట్రిక్ సాధించిన దేవేందర్ గౌడ్, బీసీ సంక్షేమం, ప్రొహిబిషన్, సినిమాటోగ్రఫీ, రెవెన్యూ, హోం శాఖల మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వహించి ప్రజలకు విశేష సేవలు అందించారని అన్నారు. అలాగే తెలుగుదేశం పార్టీలో కీలక నాయకుడిగా ఎదిగి, అనంతరం రాజ్యసభ సభ్యునిగా సేవలందిస్తూ పేద, బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేసి ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలూరి నాగార్జున, రఘుమా రెడ్డి, ఏరేష్ పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# కల్లూరుగూడెం ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ పనుల పరిశీలన.!

- రూ.100 కోట్లతో నిర్మాణం.
- 60 శాతం పనులు పూర్తి.

**సత్తుపల్లి, మార్చి 18 (తెలంగాణ ముచ్చట్లు):**

వేంసూరు మండలం కల్లూరుగూడెం వద్ద నిర్మాణంలో ఉన్న ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ పనులను రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ బుధవారం పరిశీలించారు. స్థానిక రైతులతో కలిసి పనుల పురోగతిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుమారు రూ.100 కోట్ల వ్యయంతో నిర్మాణం జరుగుతున్న ఈ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ పనులు ఇప్పటికే 60 శాతం పూర్తయ్యాయని తెలిపారు.మలేషియా ఆధునిక సాంకేతికతతో ఫ్యాక్టరీ నిర్మాణం కొనసాగుతోందని పేర్కొన్నారు.పూర్తి స్థాయిలో ప్రారంభమైతే వేంసూరు మండలంతో పాటు పరిసర ప్రాంతాల రైతులకు ఆయిల్ పామ్ పంటల ద్వారా స్థిరమైన ఆదాయం లభించే అవకాశం ఉందన్నారు. ఈ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ స్థాపనతో కల్లూరుగూడెం పరిసర ప్రాంతాల్లో భూముల ధరలు గణనీయంగా





పెరిగాయని, రైతుల్లో ఆర్థిక ఆశలు పెరిగాయని చెప్పారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు విస్తరించడంతో పాటు రోజువారీ కూలీ పనులు కూడా లభిస్తాయని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని, కాలుష్యం లేకుండా ఈ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్వహణ జరగేలా అత్యాధునిక సాంకేతికతను వినియోగించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. పరిశ్రమ అభివృద్ధి, పర్యావరణ సంరక్షణ రెండూ సమానంగా ఉండాలని స్పష్టం చేశారు. ఇక త్వరలో సీతారామ ప్రాజెక్ట్ ద్వారా వేంసూరు మండలానికి సాగునీరు అందుతుందని, దీంతో పంట పొలాలు సస్యశ్యామలం అవుతాయని ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ తెలిపారు. వ్యవసాయం, పరిశ్రమలు కలిసివస్తే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతుల తరఫున రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేంసూరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, ఖమ్మం జిల్లా సీనియర్ నాయకులు సోమిరెడ్డి, మాజీ సొసైటీ ఛైర్మన్ గొర్ల సంజీవరెడ్డి, నాయకులు వెల్ది జగన్ మోహన్ రావు, గంగాధర్ రావు, కుక్కపల్లి శ్రీను, ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ అధికారులు, గ్రామ సర్పంచులు, రైతులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



# పామిరెడ్డిపల్లిలో స్మశాన వాటికకు నీటి వసతి కల్పించిన ఎమ్మెల్యే..

◆ **ముస్లిం సోదరుల కృతజ్ఞతలు**


**పెద్దమందడి,మార్చి18(తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామంలోని స్మశాన వాటికలో ముస్లిం సోదరుల అవసరాల కోసం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తన సొంత నిధులతో బోర్‌వెల్ ఏర్పాటు చేయించారు. నీరు పుష్కలంగా లభించడంతో గ్రామంలో నీటి సమస్యకు పరిష్కారం లభించింది.సమస్యను తెలియజేసిన వెంటనే స్పందించి నీటి వసతి కల్పించడం పట్ల ముస్లిం సోదరులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సదుపాయం ద్వారా స్మశాన వాటికలో అవసరమైన సమయంలో నీరు అందుబాటులో ఉండేలా మారిందని గ్రామస్థులు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మదిర మంజుల శ్రీశైలం, ఉప సర్పంచ్ రాములమ్మ హనుమంతు, మాజీ ఎంపీటీసీ ఇంద్రలక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్‌లు సిద్దన్న, తిక్కన్న, శౌఖత్‌తో పాటు ముస్లిం సోదరులు హనాన్, ఖయ్యూం, సమీ, సాదిక్, మైబ్ తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ బుకింగ్‌పై అవగాహన పెంచాలి హెచ్‌పీ గ్యాస్ మేనేజర్ నరేష్

**కుషాయిగూడ, మార్చి 18 (తెలంగాణ ముచ్చట్లు):**

గ్యాస్ బుకింగ్ విధానం పట్ల ప్రతి వినియోగదారుడు అవగాహన కలిగి ఉండాలని శ్రీ వెంకటేశ్వర హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ మేనేజర్ ఆడబాల నరేష్‌సూచించారు. కాప్రా సర్కిల్ పరిధిలోని కుషాయిగూడలో ఉన్న కార్యాలయంలో వినియోగదారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యాస్ సరఫరా ఆలస్యమవుతోందనే అపోహలను ప్రజలు నమ్మవద్దని తెలిపారు. అనేక మంది వినియోగదారులు గత కొన్ని నెలలుగా క్యాష్ బుకింగ్ చేసుకోవడం వల్ల బ్లాక్‌లిస్టులోకి వెళ్లే పరిస్థితులు ఏర్పడుతున్నాయని, దాని వల్ల ఆన్లైన్ బుకింగ్ తక్షణం జరగకపోవచ్చని చెప్పారు. కొంతమంది వినియోగదారులు ఈకేవైసీ పూర్తి చేయకపోవడం వల్ల కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ప్రతి వినియోగదారుడు అవసరమైన ప్రతిసారి గ్యాస్ బుకింగ్ తప్పనిసరిగా చేసుకోవాలని, బుకింగ్ విధానాన్ని సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు.గ్యాస్ కొరత ఏ మాత్రం లేదని స్పష్టం చేసిన ఆయన, ప్రస్తుతం రోజుకు నాలుగు నుంచి ఐదు వేల బుకింగ్లు నమోదవుతున్నాయని తెలిపారు. గతంలో రోజుకు సుమారు 900 బుకింగ్లు మాత్రమే ఉండగా, ఇప్పుడు మూడు నుంచి నాలుగు రెట్లు పెరగడంతో సరఫరాలో కొంత ఆలస్యం జరుగుతోందని వివరించారు.వినియోగదారులు 8888823456, 9493602222 నంబర్ల ద్వారా గ్యాస్ బుకింగ్ చేసుకోవచ్చని తెలిపారు. బుకింగ్ సమయంలో వచ్చే ఓటీపీని తప్పనిసరిగా గుర్తుంచుకోవాలని సూచించారు.వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే తమ లక్ష్యమని మేనేజర్ నరేష్‌తెలిపారు.







# ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా పంపిణీ

**ఘట్కేసర్, మార్చి 18 (తెలంగాణ ముచ్చట్లు):**

మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఘట్కేసర్ సర్కిల్ పోచారం డివిజన్ ప్రతాప్ సింగారం ప్రాంతంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముస్లిం సోదరులకు రంజాన్ “తోఫా” కిట్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్థానిక బిలాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో భారీగా ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ శరత్ చంద్ర రెడ్డి హాజరై లబ్ధిదారులకు రంజాన్ తోఫా కిట్లను అందజేశారు.ఈ సందర్భంగా తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ, రంజాన్ పర్వదినం సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న తోఫా కిట్లు ఉపవాస దీక్షలో ఉన్న ముస్లిం సోదరులకు ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. పండుగలు సామరస్యానికి ప్రతీకలని, సమాజంలో ఐక్యతను పెంపొందించేందుకు అందరూ కలిసిమెలిసి పండుగలను జరుపుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పోచారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఘట్కేసర్ మండల అధ్యక్షుడు కర్రే రాజేష్, స్థానిక నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మరియు ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వనపర్తిలో తాగునీటి సరఫరాపై ఎమ్మెల్యే సమీక్ష.. అధికారులపై ఆగ్రహం

**వనపర్తి,మార్చి18(తెలంగాణ ముచ్చట్లు):**

వేసవి నేపథ్యంలో వనపర్తి పట్టణ తాగునీటి సరఫరాపై ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి బుధవారం మున్సిపల్ అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా నీటి సరఫరాలో లోపాలపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.రామన్‌పాడు, ఎర్రగట్టు, కానాయపల్లి, గుంపుగట్టు ప్రాంతాల నుంచి సరఫరా అయ్యే తాగునీటి పరిస్థితిపై అధికారులను ప్రశ్నించారు.చిన్న సమస్యలను నిర్లక్ష్యం చేయడం వల్లే పెద్ద సమస్యలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. తాగునీటి సరఫరా, మిషన్ భగీరథ పథకానికి సంబంధించిన లోపాలను వెంటనే పరిష్క



రించాలని ఆదేశించారు.విద్యుత్ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని విద్యుత్ శాఖ అధికారులకు, ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నీరు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.తాగునీటి సరఫరాకు నియమించిన సిబ్బందిని ఇతర పనుల నుంచి తొలగించి, అదే పనికి వినియోగించాలని ఆదేశించారు.పట్టణంలో ఉన్న బోర్లను పూర్తిగా వినియోగంలోకి తీసుకురావాలని, మోటర్లు లేని బోర్లను వెంటనే సరిచేయాలని సూచించారు.కాలనీల్లో నీటి వృథా నివారణకు చర్యలు తీసుకోవాలని, అవసరమైన మాన్‌పవర్ పెంచాలని చెప్పారు.పని విషయంలో నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించిన ఎమ్మెల్యే, పాత విధానాలు మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. వారం రోజుల్లో తాగునీటి సమస్యలను పూర్తిగా పరిష్కరించాలని అధికారులకు గడువు విధించారు.ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కమిషనర్, కౌన్సిలర్లు, విద్యుత్ శాఖ మరియు మిషన్ భగీరథ అధికారులు పాల్గొన్నారు.




# ఎస్సీ యాక్షన్ ప్లాన్ అమలుకు డీసీసీ సమావేశం

◆ **నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనపై దృష్టి**
◆ **బ్యాంకర్లకు అదనపు కలెక్టర్ ఆదేశాలు**

**మేడ్చల్ మల్కాజ్గిరి, మార్చి 18 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎస్సీ యాక్షన్ ప్లాన్ 202526 అమలుకు సంబంధించి ప్రత్యేక బ్యాంకర్ల (డీసీసీ) సమావేశం నిర్వహించారు. జిల్లా షెడ్యూల్డు కులాల సేవా సహకార అభివృద్ధి సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఎస్సీ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడంపై అధికారులు, బ్యాంకర్లు విస్తృతంగా చర్చించారు. పథకం కింద రూ.1 లక్ష విలువ గల ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు 90% సబ్సిడీతో అందించబడతాయని తెలిపారు. గిగ్ వర్కర్లుగా ఆన్‌లైన్ ప్లాట్‌ఫార్మ్‌లలో పనిచేస్తున్న వారికి ఎంపికలో ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.అలాగే రూ.3 లక్షల విలువ గల గూడ్స్/ప్యాసింజర్ త్రిచక్ర వాహనాలు 70% సబ్సిడీతో, రూ.3 నుండి 7 లక్షల విలువ గల సోలార్ యూనివర్సల్ పంప్ కంట్రోల్ యూనిట్లు 60% సబ్సిడీతో మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ పథకాల ద్వారా యువతకు స్థిరమైన ఆదాయం లభించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు ఈ పథకం కింద 215 ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు, 106 త్రిచక్ర వాహనాలు, 22 సోలార్ యూనిట్లు కేటాయించినట్లు తెలిపారు. ఈ యూనిట్లను త్వరితగతిన గ్రౌండింగ్ చేయాలని బ్యాంకర్లకు సూచించారు. అర్హులైన ఎస్సీ అభ్యర్థులు మార్చి 24, 2026 లోగా దరఖాస్తులు సమర్పించాలని, బ్యాంకులు వాటిని వేగంగా పరిశీలించి రుణాల మంజూరు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు కె. బాబు మోజెస్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సి. శివ ప్రసాద్‌తో పాటు వివిధ బ్యాంకుల జిల్లా అధికారులు, కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

# రైతుల సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్‌కు వినతి

**ఎల్కతుర్తి, మార్చ్ 18. (తెలంగాణ ముచ్చట్లు):**

జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారానికి ఈరోజు రైతు సంఘం నాయకులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

రైతులు సమర్పించిన వినతిపత్రంలో ముఖ్యంగా రైతు భరోసా పథకాన్ని అమలు చేయాలని, రూ.2 లక్షల పైబడిన పంట రుణాలను పూర్తిగా మాఫీ చేయాలని పేర్కొన్నారు. అలాగే మొక్కజొన్న పంటను మద్దతు ధర ప్రకారం మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటాల్‌కు రూ.2400 చొప్పున కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

పంటల బీమా పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, గాలి, వాన, తుఫాన్ల వల్ల నష్టపోయిన పంటలకు తక్షణ పరిహారం అందించాలని రైతులు కోరారు. సాదా బైనామా ద్వారా పట్టా పాస్ పుస్తకాలు జారీ చేయాలని, వ్యవసాయ శాఖ ద్వారా సబ్సిడీపై ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లు అందించాలన్నారు.

ఇక సహకార సంఘాల ఎన్నికలను నిర్వహించడంతో పాటు ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని, యూరియా యాప్‌పై రైతులకు సరైన అవగాహన కల్పించాలని సూచించారు.

రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనలు చేపడతామని రైతు నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు నెట్టెం నారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఊట్కూరి రాములు, సీనియర్ నాయకులు మోతే లింగారెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మనోహర్ రావు, జిల్లా నాయకులు పొన్నగంటి అశోక్ రావు తదితరులు పాల్గొన్నారు.



# ఆపదలో అండగా పీఆర్టీయూ టిఎస్ ఉపాధ్యాయ సంఘం

**హన్మకొండ,మార్చి18(తెలంగాణ ముచ్చట్లు):**

హనుమకొండ జిల్లా ధర్మసాగర్ బాలుర ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తూ రచయిత, కవి, మాజీ పాత్రికేయుడిగా గుర్తింపు పొందిన మెందు ఉమామహేశ్వర్ మరణం పీఆర్టీయూ టీఎస్ సంఘానికి తీరని లోటుగా మారింది. గతంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా పనిచేసిన ఆయన సేవలను సంఘ నాయకులు స్మరించుకున్నారు.

ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మందల తిరుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఫలిత శ్రీహరి



కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. పీఆర్టీయూ క్రియాశీల సభ్యుడిగా ఉన్న నేపథ్యంలో ఉపాధ్యాయ సంక్షేమ నిధి నుంచి ఒక లక్ష రూపాయల చెక్కును కుటుంబానికి అందజేశారు.

తిరుపతి రెడ్డి మాట్లాడుతూ సభ్యుల సంక్షేమం సంఘానికి ముఖ్య లక్ష్యమని, ప్రతి సభ్యునికి అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు. శ్రీహరి మాట్లాడుతూ కుటుంబానికి ప్రభుత్వం నుంచి అందాల్సిన అన్ని సదుపాయాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా అధ్యక్షుడు యాకూబ్ రెడ్డి, ధర్మసాగర్ మండల శాఖ అధ్యక్షుడు అనిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి జాన్ సింగ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేశవ రెడ్డి, నాయకులు సురేష్, రవి, జాఫర్గఢ్ మండల మహిళా ఉపాధ్యక్షురాలు నీరజ, వెంకట్ రెడ్డి, మెందు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# జంగం శివ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు

**పెద్దమందడి,మార్చి18(తెలంగాణ ముచ్చట్లు):**

పెద్దమందడి మండల కేంద్రంలో రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని జంగం శివ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఉపవాసం ముగించుకున్న ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొని విందును స్వీకరించారు.ఈ సందర్భంగా జంగం శివ మాట్లాడుతూ.. మత సామరస్యాన్ని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు కలసి పండుగలను జరుపుకోవడం ద్వారా ఐక్యత బలపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం మాజీ జెడ్పిటిసి వెంకటస్వామి, స్థానిక నాయకులు, యువకులు మరియు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## అమావాస్య సందర్భంగా కీసరగుట్టలో అన్నాభిషేకం నిర్వహణ

**కీసరగుట్ట, మార్చి 18 (తెలంగాణ ముచ్చట్లు):**




మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కీసర డివిజన్-1 పరిధిలోని ప్రసిద్ధ కీసరగుట్టలో శ్రీ భవాని శివ దుర్గా సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా ప్రత్యేక అన్నాభిషేకం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ తటాకం వెంకటేష్ శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల నడుమ పూజారులు స్వామి వారికి అన్నాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తులకు ప్రత్యేక అనుభూతిని కలిగించింది.

## తాళం పగులగొట్టి దొంగతనం

- నిందితుడు అరెస్ట్

**కీసర, మార్చి 18 (తెలంగాణ ముచ్చట్లు):**



మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో ఇంటి తాళం పగులగొట్టి దొంగతనానికి పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుండి దొంగిలించిన బంగారు ఆభరణాలు, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సుభాష్ నగర్ కాలనీకి చెందిన ఆరుమల్ల వెంకట్ రెడ్డి ఈ నెల 16న ఉదయం సుమారు 9 గంటలకు తన భార్యతో కలిసి ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు.అనంతరం మధ్యాహ్నం 12:05 గంటలకు తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టబడినట్లు గుర్తించారు.ఈ ఘటనలో కీసర ప్రాంతానికి చెందిన బాల నేరస్థుడు దర్యాగుల జగదీష్ అలియాస్ సంతోష్ అలియాస్ సంతు ఇంట్లోకి చొరబడి, అల్మీరాలోని బంగారు ఉంగరాలు, చిన్న గొలుసు, చెవి దిద్దులు (మాటీలు) మరియు రియల్‌మీ మొబైల్ ఫోన్‌ను దొంగిలించినట్లు తేలింది.పిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన కీసర పోలీస్ ఇన్స్పెక్టర్ ఆర్కపల్లి ఆంజనేయులు ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేపట్టి, మార్చ్ 18న బుధవారం రోజు నిందితుడిని పట్టుకుని, దొంగిలించిన వస్తువులను రికవరీ చేశారు. అనంతరం నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. ఇళ్లను ఖాళీగా వదిలి వెళ్లేటప్పుడు తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని కీసర పోలీసులు ప్రజలకు సూచించారు.




## కుషాయిగూడలో పాన్, టీ షాప్‌లలో చోరీ

- తాళాలు పగలగొట్టి నగదు, సిగరెట్ ప్యాకెట్లు అపహరణ
- కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు

**కుషాయిగూడ, మార్చ్ 18 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ కుషాయిగూడ ఇండస్ట్రియల్ ఏరియాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో ఉన్న పాన్ షాప్, టీ షాప్‌లలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. భరత్ నగర్ జమ్మిగడ్డకు చెందిన కంచు గంట్ల భాస్కర్ నిర్వహిస్తున్న ఈ షాప్‌లకు మార్చి 17న రాత్రి తాళాలు వేసి వెళ్లగా, మరుసటి రోజు ఉదయం వచ్చి చూడగా షట్టర్ తెరవబడి ఉండటం, తాళాలు పగలగొట్టబడటం గుర్తించాడు.షాప్‌లలోని వస్తువులు చిందరవందరగా ఉండటంతో పాటు సిగరెట్ ప్యాకెట్లు, కొంత నగదు అపహరించబడినట్లు తేలింది. బాధితుడి ఫిర్యాదుతో కుషాయిగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎంపీ నామ

**ఖమ్మం బ్యూరో, మార్చి 18 (తెలంగాణ ముచ్చట్లు )**



తెలుగు ప్రజల ముఖ్యమైన పండుగ ఉగాది సందర్భంగా బీఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ పరాభవ నామ సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సంతోషం కలగాలని ఆకాంక్షించారు. ఉగాది పండుగ తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. కొత్త సంవత్సరాన్ని సరికొత్త ఆశయాలు, లక్ష్యాలతో ప్రారంభించి విజయాలను సాధించాలని తెలిపారు. రాష్ట్రం మరియు దేశం అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగాలని, రైతులు, కార్మికులు, విద్యార్థులు, వ్యాపారులు అన్ని వర్గాల ప్రజలు సుఖశాంతులతో జీవించాలని కోరుకున్నారు. ఉగాది పండుగ తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్న ఆయన, ఉగాది పచ్చడిలోని షడ్రుచులు మనిషి జీవితంలోని సుఖదుఃఖలు, విజయాపజయాలను సూచిస్తాయని వివరించారు. ప్రతి పరిస్థితిని సమానంగా స్వీకరించే ధైర్యం, సహనం మనలో పెంపొందాలని తెలియజేశారు. ఈ నూతన సంవత్సరంలో ప్రతి కుటుంబంలో ఆనందం, సౌభాగ్యం నెలకొనాలని, సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వం పెంపొందాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ సానుకూల దృక్పథంతో ముందుకు సాగి, సమాజ అభివృద్ధి దిశగా కృషి చేయాలని నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# మానవత్వం చాటుకున్న పల్లా కిరణ్

- అనాథ వృద్ధురాలికి కంటిచూపు ప్రసాదం

**ఖమ్మం బ్యూరో, మార్చి 18(తెలంగాణ ముచ్చట్లు)**

"సర్వేంద్రియానాం నయనం ప్రధానం" అన్న సూక్తిని నిజం చేస్తూ, ఖమ్మం నగరానికి చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త పల్లా కిరణ్ మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. కంటిచూపు కోల్పోయి చీకటిలో మగ్గుతున్న ఒక అనాథ వృద్ధురాలికి సొంత ఖర్చులతో ఆపరేషన్ చేయించి, ఆమె జీవితంలో వెలుగులు నింపారు. ఖమ్మం నగరంలోని సెయింట్ మేరీస్ వృద్ధాశ్రమంలో నివసిస్తున్న మంగా కృష్ణకుమారి అనే వృద్ధురాలు వృద్ధాప్య సమస్యల కారణంగా కంటిచూపు కోల్పోయారు. ఇటీవల పల్లా కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరంలో ఆమె పరీక్షలు చేయించుకోగా, వైద్యులు తక్షణమే ఆపరేషన్ అవసరమని సూచించారు. దిక్కులేని అభాగ్యురాలైన ఆమె పరిస్థితిని తెలుసుకున్న పల్లా కిరణ్, తక్షణమే స్పందించారు. నగరంలోని వాసన్ ఐ కేర్ హాస్పిటల్లో నిపుణులైన వైద్యులచే ఆమెకు అన్ని రకాల పరీక్షలు చేయించి, తన సొంత ఖర్చులతో విజయవంతంగా కంటి ఆపరేషన్ చేయించారు. ఆపరేషన్ అనంతరం ఆమెకు అవసరమైన కళ్ళజోళ్ళు, మందులు మరియు ఐ డ్రాప్స్‌ను కూడా ఉచితంగా అందజేశారు.

**రెండు దశాబ్దాల సేవా ప్రస్థానం:**

పల్లా కిరణ్ గత 20 ఏళ్లుగా నిరంతరం ప్రజా సేవలో కొనసాగుతున్నారు. ఆయన చేసిన కొన్ని ప్రధాన సేవా కార్యక్రమాలు వైద్య సేవలు: ఏడాదికి రెండుసార్లు ఉచిత మెగా వైద్య శిబిరాల నిర్వహణ.

**కరోనా కష్టకాలంలో:**

3000 మందికి పైగా మామిడికాయ పచ్చడి పంపిణీ, ప్రైవేటు టీచర్లు మరియు పేదలకు బియ్యం, నిత్యవసర సరుకుల అందజేత.





వరద బాధితులకు అండగా: వరదల సమయంలో బాధితులకు ఆహారం, నీరు, బట్టలు మరియు నిత్యవసర వస్తువుల పంపిణీ.

విద్యార్థులకు సహాయం: నిరుపేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ఆర్థిక చేయూత.

కులం, మతం అనే తేడా లేకుండా వృద్ధులకు, వికలాంగులకు, మహిళలకు మరియు యువతకు నిత్యం అండగా నిలుస్తున్న పల్లా కిరణ్ సేవలను స్థానికులు మరియు ఆశ్రమ నిర్వాహకులు కొనియాడుతున్నారు. "నా అంటూ ఎవరూ లేని సమయంలో కొడుకులా ఆదుకుని నాకు చూపునిచ్చిన కిరణ్ బాబుకు రుణపడి ఉంటాను" అని వృద్ధురాలు కృష్ణకుమారి కన్నీటి పర్యంతమయ్యారు.

# శ్రీ పరాభవ ఉగాది.. వసంత శోభ



భారతీయ కాలగణనం మూడు విధాలుగా చేయగా సౌరమానం, చాంద్ర మానం, బార్హస్పత్యమానంగా, సౌరమానం సూర్యుని ఉదయాస్తమయ కాలాలను ఆధారంగా చేసుకుని నిర్ణయించేది. చంద్రుని ఉదయాస్తమయ కాలాలు, వృద్ధి క్షయాలు ఆధారంగా చేసే కాల నిర్ణయం చంద్రమానమైంది. బృహస్పతి (గురు) గ్రహం చలన ఆధారంగా చేసే గణనమే బార్హస్వత్యమానం. చాంద్రమానం ప్రకారం చైత్రశుద్ధ పాడ్యమినాడు ఆ సంవత్సరంలో మొదటి దినం. యుగస్య ఆది: యుగాది. యుగం యొక్క ప్రారంభం అని దీని అర్థం. ఉగాది అంటే 'ఉ' అంటే నక్షత్రం 'గ' అంటే గమనం. నక్షత్ర గమనానికి 'ఆది' కనుక ఉగాదిగా పిలుస్తారు. సంవత్సరాది, యుగాది, ఉగాది, ఈరీతిగా అనేక పేర్లతో రూఢ్యమై అనేక సాంప్రదాయాల ద్వారా తెలుగువారికి కర్తవ్యాలను చక్కగా నిర్దేశించి చెప్పే తొలి పర్వదినం ఉగాది.

ఏ ఋతువైనా సుఖప్రదమైన, ఆనందదాయకమైనదే. మానవ జీవితము వివసితమై వసంతంలోని విశిష్టత ప్రకృతి విలాసంలో ప్రతిఫలిస్తుంది. ప్రకృతికాంత షడ్డునాలే ఆరు ఋతువులుగా ఒక్కొక్క ఋతువు ఒక్కొక్క మనఃప్రవృత్తిని వికసింపచేసి, మానవ జీవితంలో కష్టసుఖాలు తాత్కాలికాలు అని సూచిస్తాయి. ఋతువులు ప్రాచీన కాలం నుండి మానవ జీవితంలో ఆనంద ఉత్సాహాలను పెంపొందిస్తున్నాయి. చైత్రశుద్ధ పాడ్యమినాడే నూతన సంవత్సరారంభమని మన పూర్వులు నిర్ణయించడానికి కారణం వసంత ఋతువులో ప్రకృతిలో నవచైతన్యం మోసులెత్తడమే. జ్యోతిష్య శాస్త్రవేత్త వరాహమిహిరుడు వసంతకాలంలోని చైత్రశుద్ధ పాడ్యమిగా నిర్ణయించడం అప్పటి నుండి చైత్ర శుద్ధ పాడ్యమినే 'ఉగాది'గా జరుపుకుంటున్నాము. ఇది శ్రీ పరాభవ నామ సంవత్సరం. పాదం మోపకముందే యుద్ధం మొదలైంది.

సృష్టికారకుడైన బ్రహ్మ, చైత్రమాస శుక్లపక్ష ప్రథమ దినమున సూర్యోదయ వేళ సమగ్రంగా ఈ జగత్తును సృజించడంతోపాటూ, కాలగమనంలో గ్రహ, నక్షత్ర, ఋతు, మాస, వర్షవారాధిపులను ప్రవర్తింపజేసినట్లు 'చతుర్వర్గ' చింతామణి వ్రత ఖండం పేర్కొంది. వసంత శోభ రమణీయంగా ఉండి భౌతిక సుఖమే కాకుండా, ఆధ్యాత్మిక సుఖం కూడా లభించే ఉగాది పర్వదినాన అందరూ ఉదయాన్నే స్నానమాచరించి, పిల్లలు, పెద్దలు, నూతన వస్త్రాలను ధరిస్తారు. తమ తమ ఇష్ట దైవాన్ని పూజిస్తారు.

ఉగాదినాడు ప్రత్యేకంగా వేపపూత, మామిడి కాయముక్కలు, కొత్తబెల్లం, కొత్త చింతపండు, చెరుకు ముక్కలు, మిరియపు పొడి, ఉప్పు మొదలైన మిశ్రమంతో, 'ఉగాది' పచ్చడి తయారు చేస్తారు. తీపి చేదుతో వగరుతో కూడిన ఈ ఉగాది పచ్చడిని మానవ జీవితంలో ఉండే సుఖదుఃఖాలకు ప్రతీకగా చెబుతారు. మన భారతీయ సంప్రదాయంలో ప్రతి పండుగ వెనుక ఆధ్యాత్మికపరమైన విషయాలతో, ఔషధ పరమైన ఆయుర్వేద రహస్యాలెన్నో దాగివుంటాయి. ఉగాది పచ్చడిలో ఉండే తీపి, పులుపు, కారం, వగరు, ఉప్పుదనం, చేదు అనే ఆరు రుచులు ఔషధపరంగా ఆలోచిస్తే అది వ్యాధినిరోధక శక్తి వస్తుందని ఆయుర్వేదం తెలియజేస్తుంది.

వేదిచెట్టుగాలి ఆరోగ్యానికి అభప్రదం. అలాగే వేప చిగుర్లు కడుపులోని మలిపురుగుల్ని చంపేసి, తిరిగి పుట్టనీయవు. వేప ఆకును పసుపు, నూనెలో కలిపి ముద్ద చేసి ఒంటికి రాసుకుంటే చర్మవ్యాధులు నయమవుతాయి. కొత్త బెల్లం ఆకలిని కలిగిస్తుంది. కొత్త చింతపండు కఫవాతాన్ని పోగొట్టగా, కారాన్ని కలిగించే మిరియపు పొడి శరీరంలోని క్రిముల్ని నాశనం చేస్తుంది. మామిడి ముక్కలు లాలాజలాన్ని ఊరించి జీర్ణక్రియకి తోడ్పడుతుంది. ఉప్పు ఎముకలని బలపరుస్తుంది. ఈ ఆరు రుచులు ఆరు ఋతువుల్లో మనకి కలిగే ఆరు రకాల దీర్ఘకాలిక వ్యాధుల్ని తొలగిస్తాయి. ఉగాదినాడు షడ్రుచుల సమ్మేళనమైన పచ్చడిని అందరూ ఆరగించడం పంచ భక్ష్యాదులతో భోజనం ఆరోగ్యప్రదం.

**పంచాంగ శ్రవణం ఉగాది రోజున ప్రత్యేకతను సంతరించుకున్న అంశం.**

తిరుమల తిరుపతి దేవస్థాన పంచాంగం. శ్రీశైల పంచాంగం. తెలంగాణలో చెన్నూరి పంచాంగం.. ఆంధ్రలో నేమాని పంచాంగం.. ఈ నాలుగు పంచాంగాలు పూర్వం ఉండేవి. ఇప్పుడు కూడా ఉన్నాయి. ఇవి పటిష్టమైన పంచాంగాలు. జ్యోతి శాస్త్రానికి భలిష్ఠమైనవి. ఈనాడు జిల్లాకో పంచాంగ కర్తలు కుక్క గొడుగుల్లా పుట్టుకొస్తున్నారు. ఇది ఆరోగ్యకరమైన విషయం కాదు. తమ ఇష్టానుసారం పంచాంగాలు ప్రచూరించుకుంటున్నారు. ఇది ఒక వ్యాపారమైంది. ఉగాది పండుగ ఆరు నెలలకు ముందుగానే ఈ పంచాంగాలు విడుదల చేస్తున్నారు. జ్యోతి శాస్త్రము పై పట్టు లేని వాళ్ళు ఎందరో ఉన్నారు. ఏది ఏమైనా శాస్త్రాన్ని వక్రదారి పట్టించరాదు. నిజాల్ని కప్పి పెట్టి రాజకీయ నాయకులకు అనుగుణంగా జాతకాలని చెప్పడం సరైన పద్ధతి కాదు శాస్త్రాన్ని నమ్మిన పంచాంగ కర్త నిజాన్ని నిక్కచ్చిగా చెప్పాలి. పూర్వపు పంచాంగ కర్తలను ఈనాటికీ మనం స్మరించుకోవడం శాస్త్రాన్ని విస్మరించకపోవడం. పంచాంగాల్లోని విషయాలను వక్రదారి పట్టించకుండా సరియైన మార్గము చూపేవారు. కనుక ప్రామాణికమైన పంచాంగాలను ఆదరిద్దాం.!

**ఈ సంవత్సరం పరాభవ మా ... వై/విభవమా**

పంచాంగం భవిష్యత్తు గురించి సమాచారం అందించే గ్రంథం మాత్రమే కాదు, దీని వెనుక మతపరమైన ఆధ్యాత్మిక అర్థం ఉంది శ్రీమహావిష్ణువు కాలపురుషుడిని గౌరవించేందుకు పంచాంగ శ్రవణం చేస్తారు. భగవంతుని కాలాన్ని లేదా కాలపురుషుడిని ఆరాధించడం అంటే ఆయనకు నివాళులు అర్పించినట్లే. నిజానికి మన జీవితంలో సమయం యొక్క ప్రాముఖ్యతను పరిగణలోనికి తీసుకొని ప్రతిక్షణం చక్కగా జీవించాలి మన జీవితం ఎలా సాగుతుందో.. మనలో ఎవరికీ తెలియదు. ఆటుపోట్లు తిరుగులేనిది.ఎవరి కోసం వేచి ఉండవు. జీవితం అనేది పరిమితంగా ఉంటుంది. జీవితంలో సమయం ఎప్పుడూ విలువైనదే మన జీవితాలపై సమయ ప్రభావం ఉంది మనం ఎప్పటికీ తప్పించుకోలేము.మనిషి ఏదైనా చెడు కర్మ చేస్తే అతను ఆ ఫలితాన్ని అనుభవించాలి. కర్మ ఫలితాలను శాంతింప చేయడానికి ఆచార,ఆరాధన, విధులు, బాధ్యతల పంపిణీ ఉత్తమ మార్గం.కాలాన్ని కర్మ ఫలితాలను ఇచ్చే దైవాన్ని ప్రసన్నం చేసుకోవడానికి పంచాంగ శ్రవణం మనిషికి తోడ్పడుతుంది.

**పంచాంగ శ్రవణం తిథిర్వారంచన నక్షత్రి యోగః కరనమేవచ !**

పంచాంగ మితి విఖ్యాతాం లోకోయం కర్మ సాధకః "అంటే తిథి, వార, నక్షత్ర, యోగ, కరణములను ఐదు అంగములు కలది. కలిగినది పంచాంగం. ఈ ఐదు అంగాలతో కూడిన పంచాంగాన్ని ఉగాది రోజున వివిధ దేవతల తోపాటు పూజించాలనే శాస్త్ర వచనం కాగా పంచాంగ శ్రవణాన్ని చేస్తున్న సమయంలో ఉత్తరాభిముఖంగా కూర్చొని పంచాంగం వింటే శుభ ఫలితాల్ని పొందుతారని పండితుల అభిప్రాయం. ఆ సంవత్సరంలో జరుగబోయే వివిధ ఫలితాలను, లాభనష్టాలను, సంఘటనలు, వర్షాలు, ప్రమాదాలు, తదితర వాటిని పంచాంగకర్తలు అంచనా వేస్తారు.

పంచాంగ శ్రవణంచే తిథి వలన సంపదను ప్రసాదిస్తుంది. వారం ఆయుష్షును పెంపొందింపచేస్తుంది. నక్షత్రం పాపాలను తొలగిస్తే యోగం వ్యాధులను నయం చేస్తుంది. కరణం కార్యాలను సిద్ధింపచేస్తుంది. ఈ ఐదు అంగములను తెలుసుకోవడం వల్ల గంగానదిలో స్నానం చేసిన ఫలితం అభిస్తుందని తెలుస్తోంది.

పంచాంగ శ్రవణము చేసిన వారికి సూర్యుడు శౌర్యమును, చంద్రుడు, ఇంద్ర సమాన వైభవమును, కుజుడు, శుభమును, బుధుడు బుద్ధిని, గురువు గౌరవమును శుక్రుడు సుఖమును, శని ఐశ్వర్యమును, రాహువు. బాహుబలమును, కేతువు కులాధక్యమునుకలుగుతుందికనుక మానవ జన్మకు పరమ లక్ష్యమగు మోక్షప్రాప్తికి ఆధ్యాత్మిక జ్ఞానము అవసరముగాన సగుణ రూపములగు బ్రహ్మాండ, దేహ, దేవాలయాలకు ఏకత్వం సాధించి ఆధ్యాత్మిక జ్ఞానమును, బహిక, ఆముష్మిక భోగములను ముక్తిని పొందుటయే పంచాంగ జ్యోతిశ్యాస్త్ర ప్రయోజనముగా తెలియవలెను.


"సర్వేభద్రాణి పశ్యస్తు సర్వేసన్తు నిరామయా సర్వే భవన్తు సుఖిన్ మాకశ్చిత్ దుఃఖబాశ్చివేత్" అంటే అందరికీ మేలు జరగాలని, రోగ రహితులు కావాలి, అందరూ సుఖంగా ఉండాలి. ఎవ్వరూ బాధపడకూడదు అని భావం

**సర్వేజనా సుఖినోభవన్తు**



**ఆధ్యాత్మిక సాహిత్య సామ్రాట్**
" ఆధ్యాత్మిక సాహితీ వ్యాస భూషణ్ "
" సాహితీ శిరోమణి "
" కావ్యసుధ "
9247313488
*హైదరాబాద్

## తోవ



సున్నితమైన మనసును
గాయపరిచిన తర్వాత
మనుషులు నిశ్శబ్దమై పోతారు
మాటలు తగ్గి
నవ్వు మసకబారుతుంది
చిన్న విషయాలకు అతి స్పందన
పెద్దవాటికి మౌనం వహించాల్సి
వస్తుంది
నమ్మకం రంగు తెగిపోతుంది
రాత్రులు ఎడారి దీపాలవుతాయి
నిద్ర చిన్నదిగా మిగిలిపోతుంది
ఉదయం లేచినా
రోజు మొదలవదు
తాము పూర్తిగా
మారిపోయామని
ఒక దినానికి అర్థమవుతుంది
ఆ మార్పును తిరిగి
తీసుకురాలేమని తెలుస్తుంది
ఇక్కడే ఉండి
మరో జన్మలోకి ప్రయాణం
ప్రారంభమవుతుంది
మనసుకు గాయమైతే
దేహం బూడిదవుతుంది .



మండాది గోపీనాథ్
ముక్కుడు దేవులపల్లి

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## హనుమకొండలో దళిత హక్కుల కోసం భారీ మహాసభ

**ఎల్కతుర్తి, మార్చి 18(తెలంగాణ ముచ్చట్లు):**

దళిత హక్కుల పోరాట సమితి (డి హెచ్ పి ఎస్) హనుమకొండ జిల్లా రెండవ మహాసభను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మల మనోహర్ పిలుపునిచ్చారు. ఈ మహాసభను మార్చి 22, 2026న హనుమకొండలోని సిపిఐ జిల్లా పార్టీ కార్యాలయం, బాలసముద్రంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కమలాపూర్ మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ మహాసభకు మాజీ ఎమ్మెల్యే పోతరాజు, డి హెచ్ పి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రే బిక్షపతి ముఖ్య అతిథులుగా పాల్గొంటారని వెల్లడించారు. స్వాతంత్ర్యం వచ్చి దాదాపు 76 సంవత్సరాలు గడిచినా దళితుల అభివృద్ధిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని నిమ్మల మనోహర్ విమర్శించారు. ప్రతి బడ్జెట్‌లో 20 శాతం నిధులను దళితులకు కేటాయించి, ఆ నిధులను పూర్తిగా వారి సంక్షేమం కోసం వినియోగించాలని డిమాండ్ చేశారు. దళితులకు ప్రైవేట్ రంగంలో కూడా రిజర్వేషన్లు కల్పించాలని, దళితులపై జరుగుతున్న దాడులు, అఘాయిత్యాలను అరికట్టడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చూపుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను వెంటనే విడుదల చేయాలని, ఎస్సీ కార్పొరేషన్ లోన్లకు దరఖాస్తు చేసుకునే అవకాశాలను కల్పించాలని కోరారు. అదేవిధంగా, కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన "అంబేద్కర్ హస్తం" పథకం కింద రూ.12 లక్షలు ఇవ్వాలన్న ప్రతిపాదనను ఇప్పటివరకు అమలు చేయలేదని విమర్శించారు. ప్రస్తుత బడ్జెట్‌లో ఈ పథకానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కమలాపూర్ మండల కార్యదర్శి నకిర్త ఓదెలు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కు రాజు గౌడ్, బీకేఎంయూ జిల్లా ఉపాధ్యక్షుడు గోలే మహేందర్, రైతు సంఘం మండల అధ్యక్షుడు ఇసంపల్లి శంకర్, సిపిఐ నాయకులు సంతోష్ తదితరులు పాల్గొన్నారు



## మతసామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ విందు

**వనపర్తి,మార్చి18(తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తి పట్టణంలోని మక్కా మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి ఆయన ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.అనంతరం పండ్లు స్వీకరించి ఉపవాస దీక్ష విరమించిన ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.పండుగలు మతసామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తాయని, హిందూ ముస్లింలు సోదరభావంతో రంజాన్ పండుగను జరుపుకోవడం ఎంతో ఆనందదాయకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పట్టణ కౌన్సిలర్లు, మైనార్టీ నాయకులు రహీం, ముస్లిం మత పెద్దలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నాగిలిగొండలో ఘనంగా ఇఫ్తార్ విందు

◆ మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన సర్పంచ్ దంపతులు

**ఖమ్మం బ్యూరో,మార్చి 18(తెలంగాణ ముచ్చట్లు)**

మత సామరస్యానికి, సోదరభావానికి నాగిలిగొండ గ్రామం వేదికైంది. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని గ్రామంలోని ముస్లిం సోదరులకు స్థానిక సర్పంచ్ వేపూరి పద్మా రవీంద్రబాబు బుధవారం సాయంత్రం ఘనంగా ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు.

**వేడుకగా ఇఫ్తార్ విందు**

రోజంతా కఠిన ఉపవాస దీక్షలో ఉన్న ముస్లింలు, సూర్యాస్తమయం తర్వాత సర్పంచ్ ఏర్పాటు చేసిన విందులో పాల్గొని ఉపవాస విరమణ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ వేపూరి పద్మ మాట్లాడుతూ.. పండుగలు మనుషుల మధ్య దూరాన్ని తగ్గించి, ప్రేమను పెంచుతాయని పేర్కొన్నారు. గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు ఇలాగే కలిసిమెలిసి ఉండాలని ఆమె ఆకాంక్షించారు.



సర్పంచ్ దంపతులకు ఘన సన్మానం



ముస్లింల పట్ల ప్రత్యేక అభిమానాన్ని చాటుకుంటూ విందు ఏర్పాటు చేసిన సర్పంచ్ వేపూరి పద్మా రవీంద్రబాబు దంపతులను గ్రామ ముస్లిం పెద్దలు, మత గురువులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. తమపై చూపుతున్న ఆదరాభిమానాలకు ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

గ్రామ మసీదు వద్ద ఏర్పాటు చేసిన ఈ విందులో పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

సమాజంలో శాంతి, సౌభాగ్యాలు విరాజిల్లాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

స్థానిక నాయకులు, గ్రామ ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొని సంఘీభావాన్ని ప్రకటించారు.

ఈ కార్యక్రమంతో నాగిలిగొండ గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. కులమతాలకు అతీతంగా అందరూ కలిసి పాల్గొనడం చూసి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వేపూరి రవీంద్రబాబు, మాజీ ఎంపిటిసి పది మల్ల వెంకట నరసయ్య, వేపూరి రాంబాబు, కొంగర రాము, వేపురి నరసయ్య, గడ్డం పెద్ద శ్రీను, సలేందర్ చారి, చాట్ల బాబు, మసీద్ ఇమామ్ మనవర్, చిన్న జాన్,

హుస్సేన్, మీరా సాహెబ్, ఫకీర్ సాహెబ్, గన్న సాహెబ్, ముస్లిం మత పెద్దలు యువకులు పిల్లలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





# విద్యావంతులైన కార్మికులకు అవకాశాలు కల్పిస్తాం

◆ మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్

**జమ్మికుంట టౌన్, మార్చి 18 (తెలంగాణ ముచ్చట్లు):**

జమ్మికుంట మున్సిపల్ నూతన పాలకవర్గం ఏర్పాటైన నేపథ్యంలో పట్టణంలో పనిచేస్తున్న పారిశుద్య కార్మికులతో మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికుల పని వేళలు, సమస్యలు, అవసరమైన సౌకర్యాలపై చర్చించారు.

చైర్మన్ మాట్లాడుతూ పట్టణంలో పెరుగుతున్న జనాభాతో ప్రతి వార్డులో పనిభారం అధికమవుతోందని తెలిపారు. అయినప్పటికీ పారిశుద్య కార్మికులు తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తూ టీమ్ వర్క్‌తో ముందుకు సాగాలని సూచించారు. అలాగే తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టుకోవాలని సూచించారు.

శానిటేషన్ విభాగంలో పనిచేస్తున్న వారిలో ఉన్నత చదువులు చదివిన వారిని గుర్తించి, వారి అర్హతలకు అనుగుణంగా అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చైర్మన్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ సిబ్బంది చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్), వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్‌లను ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, కౌన్సిలర్లు శీలం శ్రీనివాస్, చందా రాజు, చింతల శ్రీనివాస్, అజయ్ రావు, దిడ్డి రాము, శానిటరీ ఇన్స్పెక్టర్ మహేష్, సదానందం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# వీబీ జీ రామ్ జీ కార్యక్రమాల్లో 125 రోజుల పనిని అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలి

**చిల్పూర్,మార్చి18(తెలంగాణ ముచ్చట్లు):**

జనగామ జిల్లా చిల్పూర్ మండల ఎంపీడీఓ రఘు రామకృష్ణను కలిసి మండలంలోని వివిధ గ్రామాల సమస్యలను బీజేపీ నాయకులు వివరించారు. గ్రామాల నర్సరీల్లో, వీబీజీ రామ్ జి కార్యక్రమాల్లో 125 రోజుల పనిని అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే గ్రామాలలో అర్హులైన ప్రతి వ్యక్తికి ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఇందిరమ్మ ఇండ్లు, వీధి దీపాలు, రహదారులు, మురుగు కాల్వలు వంటి మౌలిక సదుపాయాల లోపాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.మండలంలోని పలు గ్రామాల్లో ఇంకా అభివృద్ధి పనులు నిలిచిపోయిన పరిస్థితి ఉందని, ప్రజలు ప్రాథమిక సదుపాయాల కోసం ఇబ్బందులు పడుతున్నారని నాయకులు పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో మురుగు నీటి సమస్యలు, రోడ్ల దుస్థితి, రాత్రి సమయంలో సరైన వెలుతురు లేకపోవడం వంటి సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, ప్రతి గ్రామానికి సమాన ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను కోరారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ చిల్పూర్ మండల



అధ్యక్షుడు గంటె ఉపేందర్ యాదవ్, జిల్లా నాయకులు పెండ్యాల దిలీప్ కుమార్, తోట శ్రీనివాస్, వెలిశాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనలకు ఇచ్చిన హామీలను అమలుకై 25వేల కోట్లు కేటాయించాలి

◆ గిరిజన సంఘం రాష్ట్ర నాయకుల డిమాండ్

**హన్మకొండ,మార్చి18(తెలంగాణ ముచ్చట్లు):**

హనుమకొండ జిల్లా లో తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని గిరిజనులకు ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నించింది. సంఘం జిల్లా అధ్యక్షుడు వి వీరన్న నాయక్, ప్రధాన కార్యదర్శి పి శ్రీకాంత్ మాట్లాడుతూ రాబోయే 2026 27 బడ్జెట్లో గిరిజన సంక్షేమానికి కనీసం 25 వేల కోట్ల రూపాయలు కేటాయించాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ అధికారంలోకి రావడంలో దళితులు, గిరిజనుల ఓట్లు కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు. చేవెళ్ల డిక్లరేషన్ పేరుతో గిరిజనులకు పలు హామీలు ఇచ్చి, వాటిని గ్యారెంటీగా ప్రకటించినప్పటికీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క హామీ కూడా అమలు కాలేదని విమర్శించారు. గత రెండేళ్లలో గిరిజనులకు కేటాయించిన నిధుల్లో పెద్ద భాగం ఖర్చు చేయకుండా మిగిల్చారని ఆరోపించారు.



అంబేద్కర్ అభయహస్తం పథకం కింద ప్రతి గిరిజన కుటుంబానికి 12 లక్షల రూపాయలు అందించాలంటే సుమారు 12 వేల కోట్ల రూపాయలు అవసరమవుతాయని తెలిపారు. సమ్మక్క సారక్క గ్రామీణ అభివృద్ధి పథకం ద్వారా గిరిజన గ్రామపంచాయతీలకు ప్రతి ఏడాది ప్రత్యేక నిధులు కేటాయించాలని, ఇందుకు వేల కోట్ల రూపాయలు అవసరమవుతాయని పేర్కొన్నారు. గిరిజన కార్పొరేషన్ల ఏర్పాటు, ఐటీడీఏల విస్తరణ, విద్యాజ్యోతి పథకం అమలు వంటి కార్యక్రమాలకు కూడా భారీ స్థాయిలో నిధులు కేటాయించాల్సి ఉంటుందని వివరించారు.

అసైన్డ్ భూముల రక్షణ, పోడు భూములకు హక్కులు కల్పించడం వంటి అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజనులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా బడ్జెట్ ప్రవేశపెడితే తీవ్ర వ్యతిరేకత తప్పదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బానోత్ జగన్, భూక్య తిరుపతి, భూక్య స్వరూప, రాయపూరి సారయ్య, భూక్య సిద్ధు, భూక్య లాలు, అంగడి ప్రభాకర్, ధరావత్ రమేష్ పాల్గొన్నారు.



# రంగాపూర్‌లో ఘనంగా పోచమ్మ బోనాలు

◆ భక్తులతో కళకళలాడిన గ్రామం

**హుజురాబాద్ రూరల్, మార్చి 18 (తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్ మండలంలోని రంగాపూర్ గ్రామంలో బుధవారం పోచమ్మ బోనాలు ఉత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడింది. శ్రీ మడెలేశ్వర రజక యూత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో గ్రామం మొత్తం భక్తి వాతావరణంతో కళకళలాడింది.

మహిళలు సంప్రదాయ దుస్తులతో బోనాలు ఎత్తుకుని డప్పు చప్పుళ్లు, శివశత్తుల పూనకాల మధ్య ఊరేగింపుగా వెళ్లి పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు తమ మొక్కులు చెల్లిస్తూ అమ్మవారిని ప్రార్థించారు.

అనంతరం ఆలయం వద్ద సంప్రదాయం ప్రకారం గొర్రెపోతులను బలి ఇచ్చి పూజలు నిర్వహించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాన్ని విజయవంతం చేశారు.

ఈ సందర్భంగా గ్రామంలో డప్పుల మోగింపు, భక్తి గీతాలు, యువత నృత్యాలతో ఉత్సవం మరింత ఉత్సాహంగా సాగింది. గ్రామ పెద్దలు, యువత కలిసి ఏర్పాట్లు చేపట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

కార్యక్రమంలో సర్పంచ్ కుంట అరుణ, ఉప సర్పంచ్ బండి నరేష్ పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే గ్రామ ప్రముఖులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరై పోచమ్మ బోనాల ఉత్సవాన్ని ఘనంగా జరిపారు.




# ఆధార్ కార్డు వాడేవారికి కేంద్రం సూపర్ న్యూస్

- 5–17 ఏళ్ల పిల్లలకు ఉచితంగా అప్డేట్

**హైదరాబాద్:** ఆధార్ కార్డు వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. 5 నుంచి 17 ఏళ్ల మధ్య వయసు ఉన్నవారికి ఆధార్ కార్డు బయోమెట్రిక్స్ వివరాలను ఉచితంగా అప్డేట్ చేసుకునే అవకాశం కల్పించింది. యూఐడీఏఐ ప్రకటన ప్రకారం, ఈ సదుపాయం సెప్టెంబర్ 30వ తేదీ వరకు అమల్లో ఉంటుంది. సాధారణంగా బయోమెట్రిక్ వివరాలను అప్డేట్ చేసుకోవడానికి కొన్ని సర్వీస్ ఛార్జీలు వసూలు చేయబడతాయి, కానీ 5-17 ఏళ్ల పిల్లల కోసం ఈ సేవ పూర్తిగా ఉచితం.

ఈ వయసులోని పిల్లల కోసం ఆధార్ అప్డేట్ ఎందుకు అవసరం? చిన్నతనంలో తీసుకున్న ఆధార్ బయోమెట్రిక్స్ వయసు పెరుగుత మారుతాయి. ఎప్పుడు అప్డేట్ చేయకపోతే ఆధార్ ఆధారిత సేవలలో ఇబ్బందులు ఎదుర్కోవచ్చు. ధృవీకరణ అవసరాల కోసం బయోమెట్రిక్స్ పనిచేయకపోవచ్చు. అందుకే తల్లిదండ్రులు పిల్లల ఆధార్ వివరాలను సమీప ఆధార్ సెంటర్‌లోకి తీసుకెళ్లి ఉచితంగా అప్డేట్ చేయించాలి. సెప్టెంబర్ తర్వాత ఈ అప్డేట్ చేయించుకోవడానికి రుసుం చెల్లించాల్సి ఉంటుంది.

యూఐడీఏఐ ఆధార్ సర్వీస్ సెంటర్లతో పాటు దేశవ్యాప్తంగా స్కూల్స్, కాలేజీలలో ఉచిత క్యాంపులు కూడా నిర్వహిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో విద్యార్థులు ఈ క్యాంపుల ద్వారా ఆధార్ వివరాలను అప్డేట్ చేసుకోవచ్చు. ఏపీ, తెలంగాణలో కూడా ప్రతీ నెలలో మొదటి వారంలో ఈ క్యాంపులు నిర్వహించబడుతున్నాయి. కేంద్రం గూగుల్‌తో ఒప్పందం చేసుకొని ఆధార్ సెంటర్లను గూగుల్ మ్యాప్స్‌లో రిజిస్టర్ చేస్తుంది. ఇందులో సెంటర్ లొకేషన్, అందుబాటులో ఉన్న సేవల వివరాలు ముందుగా తెలుసుకోవచ్చు.




# పెట్రోల్, డీజిల్ నిల్వ చేసుకోవడంపై ముఖ్యమైన సమాచారము

**హైదరాబాద్:** ఇరాన్‌ఇజ్రాయెల్ మధ్య ఉత్పన్నమయిన ఉద్రిక్తతలు, గల్ఫ్ ప్రాంతంలోని హర్ముజ్ జలసంధిలో అంతరాయం వల్ల ప్రపంచవ్యాప్తంగా గ్యాస్, ముడి చమురు సరఫరాలో సమస్యలు నెలకొన్నాయి. ప్రపంచవ్యాప్తంగా పెట్రోలియం ఉత్పత్తుల్లో 20-25 శాతం రవాణా హర్ముజ్ జలసంధి ద్వారానే జరుగుతుంది. దీని ప్రభావం భారత్‌పై కూడా పడింది. ఇప్పటికే దేశంలో గ్యాస్ ధరలు పెరిగాయి. త్వరలో పెట్రోల్, డీజిల్ ధరలు కూడా పెరగవచ్చనే ఆందోళనలు ఉన్నాయి. కొన్ని మంది అప్రమత్తమై ముందుగానే పెట్రోల్, డీజిల్ నిల్వ చేసుకుంటున్నారు. అయితే వీటిని నిల్వ చేయడం చట్టబద్ధమా? ఎంతకాలం నిల్వ చేయవచ్చు? అనే విషయాలు ఇలా ఉన్నాయి.

పెట్రోలియం ఉత్పత్తులు మంటతో ఆవిరి విడుదల చేసే కనిష్ట ఉష్ణోగ్రతను ఫ్లాష్ పాయింట్ అంటారు. దీని ఆధారంగా పెట్రోలియం ఉత్పత్తులను మూడు వర్గాలుగా విభజించారు. ఫ్లాష్ పాయింట్ 23 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగా ఉంటే క్లాస్ ఏ, 23-65 డిగ్రీల మధ్య ఉంటే క్లాస్ బి, 65-93 డిగ్రీల మధ్య ఉంటే క్లాస్ సి వర్గంలో వస్తాయి. వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ నిబంధనల ప్రకారం, క్లాస్ ఏ రకానికి చెందిన పెట్రోలియంను అమ్మకం కోసం కాకపోతే 30 లీటర్ల వరకు నిల్వ చేసుకోవడానికి లైసెన్స్ అవసరం లేదు. 30 లీటర్లకంటే ఎక్కువ నిల్వ చేయడం చట్టబద్ధంగా నిషేధం. వ్యాపార అవసరం కాకుండా ఎక్కువ నిల్వ చేస్తే చర్యలు తీసుకోవచ్చు.

పెట్రోల్ నిల్వ కోసం గాలి తగలని పాత్రలో ఉంచితే కొద్దిరోజులకు అవిరైపోతుంది. గాలి చొరబడని డబ్బాలో నీడలో నిల్వ చేస్తే సుమారు ఒక సంవత్సరం నిల్వ ఉంటుంది. డబ్బా మూత తెరిస్తే నిల్వ కాలం తగ్గుతుంది. 20 డిగ్రీల సెల్సియస్ వద్ద సుమారు ఆరు నెలల వరకు, 30 డిగ్రీల వద్ద మూడు నెలల వరకు నిల్వ చేయవచ్చు.

డీజిల్ తక్కువ పాడవుతుందీ కానీ ఎక్కువకాలం నిల్వ చేస్తే జిగురు ఏర్పడి ఇంజిన్ ఫిల్టర్లు మూతబడేలా చేస్తుంది. గాలి చొరబడని డబ్బాలో నీడలో నిల్వ చేస్తే సుమారు ఒక సంవత్సరం నిల్వ ఉంటుంది. దీర్ఘకాల నిల్వ కోసం ప్రతీ ఆరు నెలలకు ఒకసారి బయోసైడ్ చికిత్స అవసరం. సారాంశంగా, పెట్రోల్, డీజిల్ ఎక్కువ కాలం నిల్వ చేయవచ్చు, కానీ సరైన డబ్బాలు, నీడ, మూతలతో నిల్వ చేయడం, నిర్దిష్ట కాలం పైగా నిల్వ చేయడం మానుకోవడం అవసరం.





# దళితులకు అంబేద్కర్ అభయ హస్తం పేరిట 12లక్షలు ఇస్తానని చెప్పిన హామీని నిలబెట్టుకోవాలి

- వెంటనే అంబేద్కర్ అభయ హస్తం అమలు చేయాలి
- హన్మకొండలో దళిత హక్కుల కోసం గళమెత్తిన మహాసభ
- ప్రతి దళిత కుటుంబానికి 12లక్షలు ఇవ్వాలని డిమాండ్
- ఎంహెచ్పిఎస్ ఆధ్వర్యంలో హన్మకొండలో దళిత మహాసభ



**హన్మకొండ,మార్చి18(తెలంగాణ ముచ్చట్లు):** ఎస్సిలకు 'అంబేద్కర్ అభయ హస్తం' పేరిట 12 లక్షల ఆర్థిక సహాయం అందిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మాదిగ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో హన్మకొండలోని ప్రెస్ క్లబ్‌లో దళిత మహాసభ నిర్వహించారు.ఈ సందర్భముగా అంబేద్కర్,కాన్షిరాం చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఎంహెచ్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మైస ఉపేందర్ మాదిగ అధ్యక్షతన, అయన నేతృత్వంలో జరిగిన సభలో ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య మాట్లాడుతూ మాదిగ అస్థిత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరం అత్యంత ముఖ్యమని అన్నారు. సమాజంలో మాదిగలు అన్ని రంగాల్లో రాణించేలా విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో ముందుకు రావాలని సూచించారు. ఆర్థికంగా బలపడేందుకు ప్రకటించిన హామీలు కేవలం మాటలకే పరిమితం కాకుండా అమలులోకి రావాలని అన్నారు. చేవెళ్ల డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 12 హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అధికారం చేపట్టి రెండున్నర సంవత్సరాలు గడిచినా ఇప్పటి వరకు ఎస్సీ వర్గాలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తం చేశారు. హామీలు అమలు చేయడంలో ప్రభుత్వ వైఖరి నిర్లక్ష్యంగా ఉందని, దళితుల అభివృద్ధిపై స్పష్టమైన చిత్తశుద్ధి కనిపించడం లేదని పేర్కొన్నారు.

బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తీవ్రంగా నిలదీశారు. ఎన్నికల సమయంలో భారీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని అమలు చేయడంలో విఫలమవడం ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు. దళితుల సంక్షేమానికి గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న చర్యలను ప్రస్తావిస్తూ, దళిత బంధు వంటి పథకాన్ని అమలు చేసి దళిత కుటుంబాల ఆర్థిక స్థితిని మెరుగుపరిచిన ఘనత కేసీఆర్‌దేనని పేర్కొన్నారు. దళిత బంధు ద్వారా అనేక కుటుంబాలు స్వయం ఉపాధి దిశగా ముందడుగు వేసాయని, అలాంటి దృఢ సంకల్పం ప్రస్తుత ప్రభుత్వంలో కనిపించడం లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన 'అంబేద్కర్ అభయ హస్తం' హామీ వెంటనే అమలు చేయకపోతే దళిత సమాజం తీవ్రంగా నష్టపోతుందని హెచ్చరించారు.

అంతకుముందు దళిత సంఘాల నాయకులు జన్ను జఖర్యా, మైస ఉపేందర్, వీరేందర్, బొల్లెపాక రాజేష్ మాట్లాడుతూ అంబేద్కర్ అభయ హస్తం పథకాన్ని ఆలస్యం చేయడం వల్ల లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకుని తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఎంహెచ్పిఎస్ రాష్ట్ర, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉజ్వల పథకం ప్రభావం.. రికార్డు స్థాయికి ఎల్పీజీ వినియోగం




**న్యూఢిల్లీ:** దేశంలో వంటగ్యాస్ వినియోగం గత కొన్నేళ్లుగా భారీగా పెరుగుతూ రికార్డు స్థాయికి చేరుకుంది. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ఉజ్వల పథకం ప్రభావంతో గ్రామీణ మరియు పేద కుటుంబాల్లో ఎల్పీజీ వినియోగం గణనీయంగా పెరిగింది. అయితే వినియోగం పెరిగినంత వేగంగా దేశీయ ఉత్పత్తి పెరగకపోవడంతో దిగుమతులపై ఆధారపడటం కొనసాగుతోంది.

అందుబాటులో ఉన్న విశ్లేషణల ప్రకారం, ఒక్కో ఎల్పీజీ ట్యాంకర్ సామర్థ్యం సుమారు 46 వేల టన్నులుగా ఉండగా, దేశీయ ఉత్పత్తి 3050 శాతం పెరిగినా కూడా భారతదేశానికి ప్రతి నెల 29 నుంచి 34 ట్యాంకర్లు అవసరమవుతున్నాయి. రాబోయే 2027 ఆర్థిక సంవత్సరానికి దేశీయ డిమాండ్ నెలకు 29 లక్షల టన్నుల వరకు చేరే అవకాశం ఉందని అంచనా. అదే సమయంలో సుమారు 14 లక్షల టన్నుల కొరత ఏర్పడే అవకాశం ఉంది.

ఈ లోటును భర్తీ చేయడానికి 13 నుంచి 15.6 లక్షల టన్నుల వరకు ఎల్పీజీ దిగుమతులు అవసరమవుతాయని నిపుణులు చెబుతున్నారు. ఇది దేశం ఇంకా విదేశీ సరఫరాలపై ఎంతగా ఆధారపడుతున్నదో స్పష్టంగా తెలియజేస్తోంది. గత రెండు దశాబ్దాల్లో ఎల్పీజీ వినియోగం భారీగా పెరిగింది. 199899లో నెలకు కేవలం 5.35 లక్షల టన్నులుగా ఉన్న వినియోగం, 202425 నాటికి 3.13 మిలియన్ టన్నుల వరకు పెరిగింది. అంటే దాదాపు ఆరు రెట్లు పెరుగుదల నమోదైంది. అదే కాలంలో దేశీయ ఉత్పత్తి మాత్రం 3.6 లక్షల టన్నుల నుంచి 1.28 మిలియన్ టన్నుల వరకు మాత్రమే పెరగడం గమనార్హం.

దిగుమతుల విషయంలో భారత్ ప్రధానంగా పశ్చిమ ఆసియా దేశాలపై ఆధారపడుతోంది. ముఖ్యంగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఖతార్, సౌదీ అరేబియా, కువైట్ వంటి దేశాలు అగ్ర సరఫరాదారులుగా ఉన్నాయి. ఈ కేంద్రీకృత సరఫరా వ్యవస్థ వల్ల భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల ప్రభావం భారత్‌పై ఎక్కువగా పడే అవకాశం ఉంది.

దీంతో పాటు భారత్ ఇప్పుడు ప్రత్యామ్నాయంగా అమెరికా, కెనడా, అల్జీరియా వంటి దేశాల నుంచి కూడా ఎల్పీజీ దిగుమతులను విస్తరించే ప్రయత్నాలు చేస్తోంది.

వినియోగదారుల స్థాయిలో కూడా ఎల్పీజీ వినియోగం వేగంగా పెరుగుతోంది. పట్టణ ప్రాంతాల్లో సిలిండర్ రీఫిల్ చక్రం మరింత వేగంగా మారుతోంది. జాతీయ సగటు రీఫిల్ సైకిల్ 30 రోజులు ఉండగా, చండీగఢ్లో 19 రోజులు, ఢిల్లీలో 21 రోజులకు తగ్గింది. ఇది వినియోగం ఎంత వేగంగా పెరుగుతోందో సూచిస్తుంది.

మొత్తంగా చూస్తే, ఉజ్వల పథకం ద్వారా గ్యాస్ వినియోగం విస్తృతంగా పెరిగినా, అదే సమయంలో దేశీయ ఉత్పత్తి పెంపు, దిగుమతులపై ఆధారాన్ని తగ్గించడం వంటి సవాళ్లు ఇంకా ముందున్నాయి. ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకుంటున్నప్పటికీ, భవిష్యత్తులో డిమాండ్‌ను సమతుల్యం చేయడం కీలకంగా మారనుంది.

# నాలుగేళ్ల తర్వాత మళ్లీ ఎంట్రీ.. కొత్త హంగులతో 'డస్టర్' రీ-లాంచ్




**హైదరాబాద్:** ఫ్రాన్స్‌కు చెందిన ప్రముఖ కార్ల తయారీ సంస్థ రెనాల్ట్, భారత మార్కెట్లో మంచి క్రేజ్ సంపాదించిన తన ఐకానిక్ SUV రెనాల్ట్ డస్టర్ను నాలుగేళ్ల విరామం తర్వాత సరికొత్త అవతారంలో మళ్లీ విడుదల చేసింది. మధ్యతరగతి వినియోగదారులను లక్ష్యంగా చేసుకుని రూపొందించిన ఈ మిడ్‌రేంజ్ SUV, ఆధునిక ఫీచర్లు మరియు మెరుగైన పనితీరుతో మార్కెట్లోకి అడుగు పెట్టింది. కొత్త డస్టర్ 6స్పీడ్ మాన్యువల్, 6స్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ ఆప్షన్లతో అందుబాటులోకి వచ్చింది. ప్రారంభ ధర రూ. 10.49 లక్షలు (ఎక్స్‌షోరూమ్)గా నిర్ణయించగా, ఈ ధర సెగ్మెంట్‌లో పోటీదారులకు గట్టి సవాల్‌గా మారనుంది.

డిజైన్ పరంగా కొత్త డస్టర్ మరింత స్టైలిష్‌గా, బలమైన బాడీ స్ట్రక్చర్‌తో ఆకట్టుకుంటోంది. ముందుభాగంలో కొత్త గ్రిల్, ఎల్ఈడి హెడ్‌లైట్స్, స్పోర్టీ లుక్ కలిగిన బంపర్ వంటి ఫీచర్లు ప్రత్యేకంగా నిలుస్తున్నాయి. అంతేకాకుండా ఇంటీరియర్‌లో ఆధునిక ఇన్ఫోటైన్మెంట్ సిస్టమ్, పెద్ద టచ్‌స్క్రీన్, కనెక్టివిటీ ఆప్షన్లు వినియోగదారులకు సౌకర్యాన్ని పెంచుతున్నాయి. ఈ SUV మార్కెట్లో ఇప్పటికే ఉన్న హ్యుందాయ్ క్రెటా, మారుతి గ్రాండ్ విటారా, అలాగే రాబోయే టాటా సియెర్రా వంటి మోడళ్లకు గట్టి పోటీ ఇవ్వనుందని ఆటోమొబైల్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ఇక ఈసారి రెనాల్ట్ పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకుని హైబ్రిడ్ టెక్నాలజీపై కూడా దృష్టి సారించింది. త్వరలో రానున్న డస్టర్ హైబ్రిడ్ వేరియంట్ 1.8 లీటర్ ఇంజిన్‌తో పాటు 1.4 KWH బ్యాటరీతో అందుబాటులోకి రానుంది. ఇది ఇంధన వినియోగాన్ని తగ్గించడంతో పాటు కాలుష్యాన్ని కూడా తగ్గించడంలో సహాయపడుతుంది.

సేఫ్టీ విషయంలో కూడా కొత్త డస్టర్ ముందంజలో ఉండేలా కంపెనీ చర్యలు తీసుకుంది. అడ్వాన్స్‌డ్ బ్రేకింగ్ సిస్టమ్, ఎయిర్‌బ్యాగ్స్, స్టెబిలిటీ కంట్రోల్ వంటి ఫీచర్లు ప్రయాణికుల భద్రతను పెంచుతాయి. ఆఫ్‌రోడ్ సామర్థ్యానికి పేరుగాంచిన డస్టర్, ఇప్పుడు మరింత మెరుగైన సస్పెన్షన్‌తో కఠినమైన రోడ్లపై కూడా సులభంగా ప్రయాణించేలా రూపొందించబడింది. ప్రస్తుతం ఈ కారుకు బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. భారత మార్కెట్లో తన పాత విజయాన్ని మళ్లీ సాధించాలనే లక్ష్యంతో రెనాల్ట్ ఈ కొత్త డస్టర్‌ను వ్యూహాత్మకంగా విడుదల చేసింది. వినియోగదారుల నుంచి వచ్చే స్పందనపై కంపెనీ పెద్ద ఆశలు పెట్టుకుంది.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



అవార్డు అందుకుంటున్న గిన్నారపు మహేందర్

# కార్మిక సంక్షేమానికి స్వరం గిన్నారపు మహేందర్

**హన్మకొండ,మార్చి18 (తెలంగాణ ముచ్చట్లు):**

భవన నిర్మాణ రంగ కార్మికుల హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేస్తూ, కార్మికుల సమస్యలను బలంగా వెలుగులోకి తీసుకువస్తున్న నాయకుల్లో టిబిఎన్ఆర్కేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిన్నారపు మహేందర్ ఒకరు. పునాది స్థాయి నుంచి ఎదిగి రాష్ట్ర స్థాయికి చేరుకున్న ఆయన, కార్మికుల జీవితాల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా ఉద్యమాలను నడిపిస్తున్నారు. సంక్షేమ పథకాల అమలు, కార్మికుల భద్రత, హక్కుల పరిరక్షణ అంశాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయనతో జరిపిన ప్రత్యేక సంభాషణలో పలు కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి.


సింఎం రేవంత్ రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న మహేందర్

**ప్రశ్న:** సంక్షేమ బోర్డు ఏర్పాటు ఎలా జరిగింది?
**జవాబు:** 2009లో ప్రభుత్వం ప్రత్యేకంగా సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసింది. భవన నిర్మాణాలపై ఒక శాతం సెస్ వసూలు చేసి ఆ నిధులను కార్మికుల సంక్షేమానికి వినియోగించే విధానం ప్రారంభమైంది. ఇదే కార్మికులకు ప్రత్యక్ష లాభాలు అందించే దిశగా కీలక అడుగు అయింది.

**ప్రశ్న:** భవన నిర్మాణ కార్మికుల కోసం చట్టపరమైన రక్షణ ఎప్పుడు ప్రారంభమైంది?
**జవాబు:** దేశవ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికుల కోసం 1996లోనే చట్టపరమైన రక్షణకు బాటలు వేశారు. ఆ సమయంలో కేంద్రంలో దేవెగౌడ నాయకత్వం ఉండటం ఒక ముఖ్యమైన అంశం. అయితే చట్టం ఉన్నప్పటికీ అమలు మాత్రం వెంటనే జరగలేదు. రాష్ట్రంలో దీన్ని అమలు చేయించడానికి కార్మిక సంఘాలు సంవత్సరాల పాటు నిరంతర పోరాటం చేయాల్సి వచ్చింది.


మంత్రి కొండా సురేఖకు వినతి పత్రం అందజేస్తూ ...

**ప్రశ్న:** ఆ పోరాటాలు ఎలా మలుపు తిప్పాయి?
**జవాబు:** కార్మికులు ఒక్కటై పోరాటం చేసినప్పుడు మాత్రమే మార్పు వచ్చింది. "పునాదుల గర్జన" అనే నినాదంతో రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది కార్మికులను సమీకరించి హైదరాబాద్‌లో భారీ సభ నిర్వహించడం ఒక మలుపు. ఆ తర్వాత ప్రభుత్వం స్పందించి చట్టాన్ని అమలు చేయాల్సి వచ్చింది.

**ప్రశ్న:** అప్పట్లో ఇచ్చిన సహాయం మరియు ఇప్పటి పరిస్థితుల్లో ఏమి మార్పు కనిపిస్తోంది?
**జవాబు:** ప్రారంభంలో సహాయం చాలా పరిమితంగా ఉండేది. కానీ కార్మిక సంఘాలు నిరంతరం ఒత్తిడి తీసుకురావడంతో ఇప్పుడు సహాయం గణనీయంగా పెరిగింది. సాధారణ మరణం, ప్రమాదాలు, అంగవైకల్యం, ప్రసూతి, పెళ్లి వంటి అంశాల్లో ఇప్పుడు మెరుగైన ఆర్థిక సహాయం అందుతోంది.

**ప్రశ్న:** ఇప్పటికీ కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు ఏమిటి?
**జవాబు:** ఇంకా చాలా మంది కార్మికులు సంక్షేమ బోర్డు పరిధిలోకి రావడం లేదు. పని ప్రదేశాల్లో భద్రతా ప్రమాణాలు సరిగా పాటించకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ సమస్యలపై ప్రభుత్వం మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

**ప్రశ్న:** భవిష్యత్తులో సంఘం ఏ దిశగా ముందుకు వెళ్లాలని భావిస్తోంది?
**జవాబు:** ప్రతి కార్మికుడికి సంక్షేమ పథకాలు చేరేలా చేయడం మా లక్ష్యం. ఆరోగ్య భద్రత, పిల్లల విద్య, వృద్ధాప్య భృతి వంటి అంశాల్లో మరిన్ని పథకాలు రావాలని కోరుతున్నాం. కార్మికుల హక్కుల కోసం మా పోరాటం కొనసాగుతూనే ఉంటుంది.

**ప్రశ్న:** మీ ప్రయాణం గురించి చెప్పండి.
**జవాబు:** నా ప్రయాణం గ్రామ స్థాయి నుంచి ప్రారంభమైంది. క్రమంగా మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో బాధ్యతలు చేపట్టాను. ఈ ప్రయాణం మొత్తం కార్మికుల కోసం, వారి హక్కుల కోసం సాగింది. ఇప్పటికీ అదే దిశలో ముందుకు సాగుతున్నాను.




ఎమ్మెల్యే కడియం శ్రీహరితో మహేందర్


కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామితో మహేందర్

# ఉగాది సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ కడియం కావ్య



**వరంగల్,మార్చి18(తెలంగాణ ముచ్చట్లు):**

శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య నియోజకవర్గ ప్రజలకు నూతన తెలుగు సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది పండుగ తెలుగు సంస్కృతికి ప్రతీకగా నిలిచే ప్రత్యేక దినమని ఆమె పేర్కొన్నారు.
కొత్త సంవత్సరంలో ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, ఐశ్వర్యం, ఆనందం నెలకొనాలని ఆకాంక్షించారు. గత అనుభవాలను పాఠాలుగా తీసుకుని కొత్త ఆశలు, లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. ఉగాది పచ్చడిలోని షడ్రుచుల్లా జీవితం కూడా సుఖదుఃఖాల మేళవింపేనని, వాటిని సమానంగా స్వీకరిస్తూ అభివృద్ధి దిశగా పయనించాలన్నారు.రైతులు, కార్మికులు, యువత, మహిళలు సహా అన్ని వర్గాలు పురోగతి సాధించాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం మరింత కృషి చేస్తూ ప్రజల ఆశయాలను నెరవేర్చేందుకు కట్టుబడి ఉంటానని తెలిపారు. ఈ ఉగాది ప్రతి ఇంట కొత్త ఆశలు, కొత్త అవకాశాలను తీసుకురావాలని ఆకాంక్షించారు.

# గీత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- చైర్మన్ సుహాసిని.



**హుజురాబాద్ పట్టణం, మార్చి 18 (తెలంగాణ ముచ్చట్లు):** గీత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని మున్సిపల్ చైర్మన్ రొంటాల సుహాసిని పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని గీత కార్మికులకు 'కాటమ రక్ష' కిట్లను ఆమె చేతుల మీదుగా పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గీత కార్మికులు ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారని, వారి భద్రత కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ఈ కిట్లను అందిస్తున్నదని తెలిపారు. కార్మికుల ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ, ఎక్సైజ్ శాఖ అధికారులు పాల్గొని ప్రభుత్వ పథకాలపై వివరాలు తెలిపారు. అలాగే కౌన్సిలర్లు రమేష్ గౌడ్, పంజాల మనోజ్ గౌడ్, సొల్లు సునీత బాబు తదితరులు పాల్గొని కార్మికులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమం గీత కార్మికులలో ఆనందాన్ని కలిగించగా, ప్రభుత్వానికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

# ఖమ్మం ప్రెస్ క్లబ్‌ను రాష్ట్రంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దుతా

- అంతోటి శ్రీనివాస్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు
- భారతదేశపు తొలి సంపాదకులు, విలేకరుల చిత్రపటాల ఆవిష్కరణ

**ఖమ్మం బ్యూరో, మార్చి 18(తెలంగాణ ముచ్చట్లు)**



భారతదేశపు తొలి సంపాదకులు, విలేకరుల చిత్రపటాల ఆవిష్కరణ కార్యక్రమం ఖమ్మం ప్రెస్ క్లబ్‌లో ఘనంగా జరిగింది. టిడబ్ల్యూజెఎఫ్ (హెచ్ 2843) ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంతోటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి ముఖ్య అతిథిగా హాజరై చిత్రపటాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ ప్రాంగణం జర్నలిస్టుల గౌరవానికి ప్రతీకగా నిలిచింది.
చిత్రపటాల ఆవిష్కరణ అనంతరం నాగండ్ల దీపక్ చౌదరి మాట్లాడుతూ, సమాజంలో జర్నలిస్టుల పాత్ర అపారమని, ప్రజాస్వామ్య పరిరక్షణలో వారు కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు. తొలి తరం జర్నలిస్టులు ఎటువంటి ప్రయోజనాలు ఆశించకుండా సమాజ హితం కోసం పనిచేసిన త్యాగధనులని కొనియాడారు. జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన డిమాండ్లు వారి హక్కులేనని, వాటి పరిష్కారానికి తాను కట్టుబడి ఉంటానని హామీ ఇచ్చారు.
ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి నానబాల రామకృష్ణ మాట్లాడుతూ, అంతోటి శ్రీనివాస్ నాయకత్వంలో ప్రెస్ క్లబ్ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని, యూనియన్‌లను సమన్వయం చేస్తూ ప్రెస్ క్లబ్ ప్రతిష్టను పెంచుతున్న తీరు అభినందనీయం అని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ, ప్రెస్ క్లబ్ వార్షికోత్సవం, మహిళా దినోత్సవ కార్యక్రమాలు వంటి పలు సేవా కార్యక్రమాల ద్వారా ప్రెస్ క్లబ్‌కు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చారని తెలిపారు.




ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంతోటి శ్రీనివాస్ మాట్లాడుతూ, ఖమ్మం ప్రెస్ క్లబ్‌ను రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన మోడల్
ప్రెస్ క్లబ్ గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. తాను ప్రెస్ క్లబ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత, అత్యంత ఘనంగా
ప్రెస్ క్లబ్ 24 వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించామని, సీనియర్ పాత్రికేయులు మోత్కూరి వెంకటేశ్వర్లును స్మరించుకున్నామని, మొక్కలు నాటే కార్యక్రమం, మహిళా జర్నలిస్టులకు సన్మాన కార్యక్రమం, ఈ రోజు ప్రఖ్యాత జర్నలిస్టుల చిత్రపటాలతో ప్రెస్ క్లబ్‌కు వన్నె తెచ్చామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో టి.డబ్ల్యూ.జె.ఎఫ్.హెచ్ 2843 జిల్లా కోశాధికారి అర్వపల్లి నగేష్, టీబీజేఏ జిల్లా అధ్యక్షులు వందనపు సామ్రాట్ గుప్త,
కుంభం రవికుమార్, జిల్లా సంయుక్త కార్యదర్శి, టీబీజేఏ నగర అధ్యక్షుడు వి.ఆర్.ఎమ్. వెంకట్, కప్పల మధు, మొగిలి నాగేశ్వరరావు, నల్లా రాకేష్, వెలిగొండ వెంకట్, ఓరుగంటి కిరణ్, షేక్ మీరా, ఎర్ర రాజేంద్ర ప్రసాద్, చల్లగొండ సతీష్, కందరబోయిన నాగకృష్ణ, పాగ యోనా, వేములకొండ రమేష్, మామిడాల వీరబాబు, యేలిశెట్టి రామకృష్ణ, గరిపెల్లి మహేష్, పోయిలబోయిన శ్రీను, వంగ పవన్ గౌడ్, లింగాల రామ్మూర్తి గౌడ్, మద్దెల చెన్నప్ప, చిన్నంశెట్టి రాంబాబు, తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

# రాజకీయాల్లో పదవీ విరమణ ఉండదు


- రాజ్యసభ వీడ్కోలు సభలో ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు!



**న్యూఢిల్లీ:** రాజకీయ ప్రస్థానంలో పదవీ విరమణ అనేది కేవలం ఒక సాంకేతిక ప్రక్రియ మాత్రమేనని, ప్రజా సేవలో ఎప్పుడూ విరామం ఉండదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. రాజ్యసభ సభ్యుల వీడ్కోలు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, సభను వీడుతున్న వారు సమాజ శ్రేయస్సు కోసం తమ వంతు కృషిని నిరంతరం కొనసాగించాలని పిలుపునిచ్చారు. పార్లమెంటులో జరిగిన సుదీర్ఘ చర్చలు, విభిన్న అభిప్రాయాలు అన్నీ భారత ప్రజాస్వామ్య బలాన్ని చాటుతాయని ఆయన పేర్కొన్నారు. దేశాభివృద్ధిలో ప్రతి ఒక్క సభ్యుని అనుభవం ఎంతో విలువైనదని, ఆ అనుభవ పాఠాలు ఎన్నటికీ వృధా కావని మోదీ భరోసా ఇచ్చారు.
ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన ఎంపీలు.. హెచ్‌డీ దేవెగౌడ, శరద్ పవార్, మల్లిఖార్జున ఖర్గే వంటి సీనియర్ నేతల నుండి ఎన్నో విషయాలు నేర్చుకోవాలని ప్రధాని సూచించారు. దశాబ్దాల కాలం పాటు పార్లమెంటరీ సేవలో గడిపిన వీరి జీవితాలు యువ నాయకులకు మార్గదర్శకాలని ఆయన కొనియాడారు. ఇదే క్రమంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే తనదైన శైలిలో చమత్కరిస్తూ.. దేవెగౌడ గారితో తనకున్న 54 ఏళ్ల అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. "ఆయన మమ్మల్ని ప్రేమించి, మోదీని పెళ్లి చేసుకున్నారు" అని ఖర్గే అనడంతో సభలో నవ్వులు పూశాయి. రాజకీయాల్లో ఉన్నవారు అలసిపోరని, దేశం కోసం నిరంతరం పనిచేస్తూనే ఉంటారని ఖర్గే అభిప్రాయపడ్డారు. ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో 26 మంది ఏకగ్రీవంగా ఎన్నికవ్వగా, మిగిలిన స్థానాలకు పోలింగ్ ద్వారా అభ్యర్థులు విజయం సాధించారు.

# తమిళ రాజకీయాల్లో త్రిష సెన్సేషన్

- విజయ్ పార్టీ పొత్తుల వెనుక మాస్టర్ మైండ్?



తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రాజకీయ సమీకరణాలు అనూహ్య మలుపులు తిరుగుతున్నాయి. దళపతి విజయ్ నేతృత్వంలోని 'తమిళ వెట్రి కళగం' పార్టీ పొత్తుల విషయంలో దక్షిణాది స్టార్ హీరోయిన్ త్రిష పేరు ఇప్పుడు మారుమోగుతోంది. టీవీకే పార్టీ, నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ తో చేతులు కలిపే విషయంలో త్రిష కీలక పాత్ర పోషిస్తున్నట్లు కోలీవుడ్ మరియు రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. పొత్తులకు సంబంధించిన తుది నిర్ణయం ఆమె వ్యూహాల మేరకే జరుగుతుందనే వార్తలు ఈ ఊహాగానాలకు మరింత బలాన్ని చేకూర్చుతున్నాయి. ఇటీవల ఆమె కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీ అయ్యారనే వార్త తమిళ రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది.
ప్రస్తుత సమాచారం ప్రకారం, కేవలం విజయ్ పార్టీయే కాకుండా ప్రధాన ప్రతిపక్షం ఏఐఏడీఎంకే నేతలు కూడా త్రిషతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది. అధికార డీఎంకేను ఎదుర్కోవడానికి బీజేపీ, ఏఐఏడీఎంకే మరియు టీవీకే పార్టీలు కలిసి ఒక బలమైన కూటమిగా ఏర్పడే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఒకవేళ ఈ మూడు శక్తులు కలిస్తే తమిళనాడు రాజకీయ చిత్రం పూర్తిగా మారిపోవడం ఖాయం. సినీ గ్లామర్‌కు తోడుగా రాజకీయ వ్యూహాలు తోడైతే అధికార పార్టీకి గట్టి పోటీ తప్పదని స్పష్టమవుతోంది. అయితే త్రిష నేరుగా రాజకీయ అరంగేట్రం చేస్తారా లేదా తెర వెనుక ఉండి చక్రం తిప్పుతారా అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in